
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
మంగళవారం 26 నవంబరు 2024





నందివెలుగు-కొల్లిపర మధ్య చేలల్లో యంత్రాలతో కోతకోసి, ప్లాట్ల రోడ్లపై ఆరబోసుకున్న రైతులు

- వైసీపీ సర్కారులో పట్టిన గ్రహణం నుంచి విముక్తి
- మారుమూల ప్రాంతాల్లో సైతం మరమ్మతు పనులు
- ఉమ్మడి జిల్లాకు భారీగా నిధులు మంజూరు



దుగ్గిరాలలో మంగళగిరి- తెనాలి రోడ్డు నిర్మాణ పనులు

రహదారులకు మహర్దశ



మంగళగిరి- తెనాలి రోడ్డు నిర్మాణ పనులు

గుంటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు రహదారులను ఆవరించిన గ్రహణం ఎట్టకేలకు వీడుతున్నది. రహదారుల మరమ్మతులు, నిర్వహణ, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రహదారుల మరమ్మతు, విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే మూడుజిల్లాల్లో ప్యాచ్ వర్కులు, తక్షణ మరమ్మతుల కోసం గత నెలలో రూ. 35 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం, తాజాగా రహదారుల అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరు చేసింది.

గుంటూరు జిల్లాకు రూ. 559.84 కోట్లు

విభజిత గుంటూరు జిల్లాలో రహదారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు మంజూరు చేసింది. జిల్లాలోని రహదారులు, వంతెనల నిర్మాణం, అభివృద్ధి కోసం 559.84 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో జిల్లాలో 719 కిలోమీటర్ల మేర రహదారుల్లో మరమ్మతులు చేస్తారు. గుంతలు పూడ్చి రోడ్లు వేస్తారు. వాటితోపాటు ఆగిపోయిన ఆర్వోబీలు, వంతెనలు నిర్మించడానికి కూడా నిధులు కేటాయించారు. ఎండీఆర్ ప్లాన్ కింద జిల్లాలోని 3 రహదారుల్లో 15.6 కి.మీ మేర రోడ్లు వేయనున్నారు. ఇతర జిల్లాలను కలిపే 4 రోడ్లలో 18.4 కి.మీ మేర రోడ్లు వేస్తున్నారు. సీఆర్ఎఫ్ నిధుల కింద 3 రోడ్లలో 14.75 కి.మీ మేర రోడ్లు వేస్తున్నారు. కాగా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ఫేజ్-1 కింద 262.64 కోట్లతో జిల్లాలోని 13 రోడ్లు 94.11 కి.మీ మేర నిర్మించనున్నారు. బాగా దెబ్బతిన్న 12 రోడ్లలో 69.84 కి.మీ మేర మరమ్మతులు చేపట్టగా, 50 రోడ్లకు సంబంధించి 222 కి.మీ మేర తక్షణ మరమ్మతులు, ప్యాచ్ వర్కులు చేపట్టనున్నారు. ఇంటెన్సివ్ ప్యాచ్ వర్కుల కింద 19 రోడ్లలో 107.79కి.మీ మేర, అంచులు తెగిన రోడ్ల ప్యాచ్ వర్కులు, జంగిల్ క్లియరెన్స్ కింద 33 రోడ్లలో 176.63 కి.మీ మేర రహదారి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వీటితోపాటు హనుమాన్‌పాలెం వద్ద ఆర్‌వోబీ నిర్మాణానికి రూ. 28 కోట్లు కేటాయించారు. కొండవీడు ఘాట్ రోడ్డుకు 6.8 కోట్లు కేటాయించారు. వెనిగండ్ల-జొన్నలగడ్డ రోడ్డు, గుంటూరు- నిడమర్రు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గుంటూరు- బాపట్ల- చీరాల రోడ్డు, గుంటూరు- ఫిరంగిపురం రోడ్డు, ఎయిమ్స్ గేటు నుంచి ఎన్‌హెచ్- 16 వరకూ అప్రోచ్ రోడ్డుల నిర్మాణానికి మోక్షం లభించింది. మంగళగిరి-

(మిగతా 8వ పేజీలో..)

- ధాన్యం తేమ సాకుతో రైతు నిలువు దోపిడీ
- వాతావరణ మార్పులతో రైతుల్లో భయం... భయం
- యంత్రాలతో కోసిన ధాన్యంలో తేమ శాతం 19 నుంచి 21 వరకు
- ప్రభుత్వం ఇచ్చిన పరిమితి 17 శాతం
- అదనపు తేమ శాతాలు చూపి ఎదురు వసూలు చేస్తున్న మిల్లర్లు
- బస్తాకు రూ. 200 నుంచి రూ.300 కడితేనే ధాన్యం కొనేది!
- ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 1740
- బయటి మార్కెట్‌లో ధర రూ.1300 నుంచి రూ.1400 వరకు



తేమ సాకు.. రైతుకు షాకు



ధాన్యం తేమ శాతాన్ని అంచనా వేస్తున్న పరికరం

తెనాలి, నవంబరు 25, (ఆంధ్రజ్యోతి): ఆకాశం మేఘావృతమై ఎప్పుడు వర్షం పడుతుందోనన్న భయం... ఆరుగాలం పండించిన ధాన్యం ఎక్కడ వర్షానికి తడిచిపోయోనన్న ఆందోళనతో యంత్రాలతోనే వరి కోతకు ప్రాధాన్యం ఇస్తున్నారు డెల్టాలోని రైతులు. అయితే కోత కోసిన ధాన్యాన్ని వెంటనే అమ్మకుండా ఆరబెట్టి, తేమ తగ్గాకే అమ్మకాలు చేస్తారు. అయితే వాతావరణం అనుకూలంగా లేకపోవటంతో రైతులు ఆరబెడితే ఎక్కడ తడిచి పోయి అసలుకే నష్టం వస్తుందన్న భయంతో అమ్మటానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే వీరి భయాన్ని, వాతావరణ ప్రతికూలతను మిల్లర్లు వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. రైతులను నిలవు దోపిడీ చేసేస్తున్నారు.

ప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు అనేక మార్గాలను మార్కెటింగ్ కోసం ప్రవేశపెడితే, అవేమీ రైతులకు అక్కరకు రావటంలేదు. కృష్ణా డెల్టాలో 2024 ఖరీఫ్ పంట వచ్చేసింది. గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో ఉన్న కోతలు మొదలుపెట్టేశారు. అయితే ధాన్యం అమ్ముకోటానికి గతంలోలాగా ఆర్‌ఎస్‌కేల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా వాట్సప్‌లో హాయ్ అని పెడితేచాలు... ధాన్యం అమ్మేసుకునేలా మార్పులు కూడా చేశారు. ఇదంతా బాగానే ఉంది. అయితే ఈ తతంగం మొత్తం పూర్తయిన తర్వాత వెళ్లాల్సింది మిల్లర్ల దగ్గరకే కావటంతో వారి దగ్గర దోపిడీకి మాత్రం తెరపడలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

కృష్ణా పశ్చిమ డెల్టా కింద గుంటూరు జిల్లా పరిధిలో 1,84,190 ఎకరాలు, బాపట్ల జిల్లా పరిధిలో 3,79,997 ఎకరాలు, ప్రకాశం జిల్లా పరిధిలో 7,164 ఎకారలలో ఖరీఫ్ వరి సాగవుతోంది. వీటిలో ఒక్క ప్రకాశం జిల్లాలో, బాపట్ల జిల్లాలోని తీర మండలాల్లో కొన్నిచోట్ల మినహాయించితే, మిగిలిన విస్తీర్ణం మొత్తం వరి కోతకు సిద్ధమైంది. తెనాలి, కొల్లిపర, మంగళగిరి, దుగ్గిరాల, పెదకాకాని, గుంటూరు, పొన్నూరు, బాపట్ల జిల్లా పరిధిలో కొల్లూరు, వేమూరు, అమృతలూరు, చుండూరు, భట్టిప్రోలు, చెరుకుపల్లి, రేపల్లె, మరికొన్ని మండలాల్లో వరి కోతలు మొదలయ్యాయి. మనుషులతో కోత కోయించే రైతులు మాత్రం వరుణుడిపై భారం వేసి, కుప్పలు వేసేందుకు వరి ఓదెలను చేలపైనే ఆరేవరకు ఉంచేస్తున్నారు. అయితే వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో, వరి కోత కోసేందుకు, కుప్పలు వేసేందుకు కూలీలు రేట్లు పెంచేశారు. వీరిపరిస్థితి అటుంచితే, 70 శాతం మంది రైతులు యంత్రాలతోనే కోతకోసి, అమ్మేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. తడిచి పోతే తర్వాత రేటు రాదని, పండించిన పంట దక్కకుండా పోతుందనే ఆందోళనతో కోత, కుప్ప, నూర్పిళ్లతో పని లేకుండా ఒకేసారి వరికోత యంత్రం సాయంతో కోసేసి, ధాన్యం అమ్ముకుంటున్నారు. అయితే యంత్రాల సాయంతో కోత కోసినప్పుడు ధాన్యంలో తేమ శాతం 19 నుంచి 21 వరకు ఉంటోంది. అదే వాతావరణం బాగుంటే తేమ తగ్గేవరకు ఆరబెట్టి అమ్ముకునేవారు. అయితే వరుణుడి

(మిగతా 6వ పేజీలో..)

రెట్టింపు తేమ శాతం వసూలు చేస్తున్నారు

సాధారణంగా తేమ ఉన్న ధాన్యం ఆరబెడితే, ప్రతి పది బస్తాలకు ఒక బస్తా వ్యత్యాసం ఉంటుంది. ఉదాహరణకు ఒక రైతు 100 బస్తాల ధాన్యం మిల్లర్‌కు వేశారనుకుంటే, దీనిలో తేమ వల్ల తరుగు 10 బస్తాలు ఉండొచ్చు. అంటే ప్రభుత్వ ధర ప్రకారం రూ. 17,400 మిల్లర్‌కు నష్టం వచ్చే మాట వాస్తవమే. అయితే 100 బస్తాలకు రూ. 300 చొప్పున ఎదురు వసూలు చేస్తుండటంతో అన్ని బస్తాలపైనా రూ. 30వేలపైనే మిల్లర్‌లకు రైతు ఎదురు కట్టాల్సి వస్తోంది. అంటే దాదాపు రెట్టింపు రేటును తేమ శాతం సాకుగా చూపి రైతు నుంచి ముందే దోచేస్తున్నారు. అదే తేమ శాతాన్ని బట్టి ఒక శ్లాబ్ రేటును ప్రభుత్వమే నిర్ణయిస్తే అంత నష్టం ఉడదనేది రైతుల మాట.

ప్రభుత్వమే రేటు నిర్ణయించాలి

ధాన్యం కొనుగోలుకు సంబంధించి తేమ శాతం 17 వరకు, మట్టి, రాళ్లు, తాలు గింజల వంటివి ఇతర వ్యర్థాలు 1 శాతం వరకు ఉండొచ్చని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. చెడిపోవటం, రంగు మారటం, మొకలు వంటివి ఉన్న ధాన్యమయితే 5 శాతం, పక్వతలేని, ముడుచుకుపోయిన గింజలు 3 శాతం, ఏ గ్రేడ్ రకంలో తక్కువ రకం కానీ, కేళీలు 3 శాతం వరకు ఉండొచ్చని సూచించింది. అయితే ప్రస్తుతం తేమ శాతం సమస్యగా మారింది. 17 శాతం లోపు తేమ ఉంటే, ఎ గ్రేడ్ రకానికి రూ. 1740 చెల్లిస్తారు. అయితే ఆపై తేమ శాతం ఉన్నవాటికి మాత్రం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం వాతావరణం ఇబ్బందికరంగా ఉన్న తరుణంలో తేమ ఉన్న ధాన్యాన్ని అమ్మక తప్పదని, ప్రభుత్వ కొనకపోతే చివరకు దళారులకైనా తెగనమ్మక తప్పదని రైతులు చెబుతున్నారు. అయితే 17 శాతానికి మించిన అదనపు శాతాలకు 21 శాతం వరకు ప్రభుత్వమే ధరలో తరుగుదల నిర్ణయిస్తే, మిల్లర్ల దోపిడీ తగ్గుతుందనేది రైతుల విన్నపం.

కనపడని ఖాకీ.. వినపడని సైరన్

- రెచ్చిపోతున్న రేసర్లు
- రింగ్ రోడ్డులో ప్రయాణం.. ప్రాణ సంకటం
- నాడు తృటిలో తప్పిన ప్రాణాపాయం ...
- తాజాగా అదే స్పాట్‌లో ఇరువురు దుర్మరణం
- గాలిలో దీపంలా ప్రయాణికుల భద్రత
- ప్రాణాలు పోతున్నా ఉలుకు పలుకు లేని పోలీస్
- 104 మంది సిబ్బందికి విధుల్లో ఉండేది కేవలం 20 మందే...
- ట్రాఫిక్ గురించి పట్టించుకోని పోలీస్ అధికారులు
- అసలే సిబ్బంది కొరత... ఆపై అదనపు బాధ్యతలు



గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నగరంలో ఖాకీ కనిపించదు... కనీసం సైరన్ మోత వినిపించదు. అసలు నగరంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఉందా... లేదా... అనే అనుమానాలు. ఆర్భాటపు ప్రకటనలకే విజుబుల్ పోలీసింగ్... కనీసం సాయంత్రం వేళలా అండ్ ఆర్డర్ పోలీసుల జాడ కూడా కరువు అవుతుంది... ఫలితంగా రేసర్లు రెచ్చిపోతున్నారు.... ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది... ఉదయం, సాయంత్రం వేళల్లో కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య అత్యంత దారుణంగా ఉంటోంది. గతంలో నగరంలోని ఏ ప్రాంతంలోని వారైనా కార్యాలయానికో, స్కూలుకో, కాలేజీకో, మార్కెట్‌కో వెళ్లాలంటే కనీసం 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలో చేరుకునేవారు. కానీ నేడు అదే గమ్యాన్ని చేరుకోవాలంటే కనీసం 30 నుంచి 40 నిమిషాల సమయం పడుతోంది... నగరంలో ట్రాఫిక్ పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారై

(మిగతా 8వ పేజీలో..)

ఐపీఎల్ జట్టులో.. గుంటూరు కుర్రోడు

- క్రికెటర్ రషీద్‌కు ఐపీఎల్ వేలంలో రూ. 30 లక్షలు
- చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులో చోటు



రషీద్

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన యువ క్రికెటర్ షేక్ రషీద్ ఐపీఎల్ వేలంలో రూ. 30 లక్షలకు చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు దక్కించుకున్నది. సోమవారం జరిగిన వేలంలో రషీద్‌ని చెన్నై జట్టు కొనుగోలు చేసింది. అయితే ఆ జట్టులో దిగ్గజ ఆటగాళ్లు ఉన్న నేపథ్యంలో ఐపీఎల్ మ్యాచ్‌లలో ఆడే అవకాశం రషీద్‌కు ఇస్తారో, లేదోనన్న అనుమానాలు ఉన్నాయి. గత ఏడాది కూడా ఇలానే చెన్నై జట్టు రషీద్‌ని దక్కించుకోగా మ్యాచ్‌లలో ఆడే అవకాశం కల్పించలేదు. 20 సంవత్సరాల వయస్సు కలిగిన ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ స్వస్థలం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామం. రషీద్ బాల్యం ఇక్కడే గడిచింది. రషీద్ క్రికెట్ ప్రాక్టీసు కోసం ఆయన కుటుంబం గుంటూరు నగరానికి వలస వచ్చింది. ఇక్కడి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఒక చిన్న ఇంటిలో నివాసం ఉంటున్నది.

రషీద్ ఇప్పటివరకు 17 ఫస్టుక్లాస్ మ్యాచ్‌లు ఆడారు. 30 ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేసి ఒకసారి నాటౌట్‌గా నిలిచారు. 36.13 సగటుతో 1048 పరుగులు సాధించారు. ఇందులో ఇటీవలే హైదరాబాద్‌తో జరిగిన రంజీ మ్యాచ్‌లో 203 పరుగుల డబుల్ సెంచరీతో మెరిశాడు. అలానే లిస్టు ఏ మ్యాచ్‌లు 8 ఆడి 62 పరుగులు మాత్రమే చేశాడు. టీ20లు 11 మ్యాచ్‌లు ఆడి 300 పరుగులు చేశాడు. 42.85 సగటుతో ఈ పరుగులు చేశాడు. టీ20లలో బెస్టు స్కోరు 100గా ఉన్నది. టీ20లలో స్ట్రైక్ రేట్ 139.54గా ఉన్నది. రషీద్ లెగ్‌స్పిన్ కూడా వేయగలిగిన ఆల్‌రౌండర్. అయితే ఆయనకు ఎక్కువగా బౌలింగ్ చేసే అవకాశాన్ని ఆయా జట్లు కల్పించలేదు. ఈ కారణంగా ఇప్పటివరకు రెండు వికెట్లు మాత్రమే తీశారు. రషీద్ అండర్-19 ప్లేయర్‌గా కూడా కొనసాగుతున్నాడు.

అవకాశాలు కల్పించాలి

ప్రతిభ ఉన్న క్రికెటర్లకు అవకాశాలు కల్పిస్తేనే వారు తమ సత్తాని నిరూపించుకోగలుగుతారు. ఈ సూత్రాని ఇండియన్ క్రికెట్‌లో మాజీ కెప్టెన్ సౌరబ్ గంగూలీ ఆచరణలో పెట్టడం వలనే ఎంఎస్ ధోని, యువరాజ్ సింగ్, వీరేంద్ర సెహ్వాగ్ హర్భజన్ సింగ్ వంటి ఆటగాళ్లు తయారయ్యారు. ఆ తర్వాత ఎంఎస్ ధోని తను కెప్టెన్సీగా ఉండగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, సురేష్ రైనా వంటి ఆటగాళ్లకు అవకాశం కల్పించారు. రషీద్ ముఖ్యంగా టెస్టు మ్యాచ్‌లలో సుదీర్ఘంగా ఆడగలిగిన సత్తా ఉన్నది. అలానే టీ20లలో నూ చురుకుగా బ్యాటింగ్ చేస్తాడు. ఈ నేపథ్యంలో చెన్నై సూపర్‌కింగ్స్ అతనికి అవకాశాలు కల్పించాలని క్రికెట్ అభిమానులుగా అందరం కోరుకుందాం.



పోలీస్ పేరెడ్ గ్రౌండ్స్‌లో 'మహిళా.. మీ కోసం' వాహనాలు ప్రాంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ, కమిషనర్

మహిళల రక్షణ కోసమే 'మహిళా.. మీ కోసం'

- అత్యవసర సమయాల్లో మహిళలు సద్వినియోగించుకోవాలి
- వాహనాలను లాంఛనంగా ప్రారంభించిన కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణే ధ్యేయంగా ఎస్పీ సతీష్‌కు మార్ రూపొందించిన 'మహిళా.. మీ కోసం' కార్యక్రమం మహిళలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు ఈ మేరకు సోమవారం పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన మహిళా.. మీకోసం కార్యక్రమం ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి ఆయా వాహనాలను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోజురోజుకు మహిళలపై జరుగుతున్న వేధింపులు, వివక్ష నేపథ్యంలో సమాజంలో మరింతగా మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్‌శాఖ పరంగా తనకు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను వినియోగించుకొని ఎస్పీ సతీష్‌కుమార్ ఇటువంటి కార్యక్రమానికి రూపకల్పన చేయడం అభినందనీయం అన్నారు. ఈ నేపథ్యంలో రాత్రివేళ తమ గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన మహిళలు భయ పడాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. ప్రతి మహిళ దీనిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె సూచించారు.

ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ మహిళా మీకోసం అనే ఈ కార్యక్రమాన్ని ప్రధానంగా మూడు అంశాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించామన్నారు. మహిళా ప్రయాణికులు అర్ధరాత్రి సమయంలో రైల్వేస్టేషన్, బస్‌స్టాండ్ వద్దకు వచ్చి ఉంటే వారు సుర క్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం కోసం ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. అదే విధంగా విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్లలో తిరుగుతూ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే యువకులను కట్టడి చేస్తారన్నారు. అంతేగాక మహిళలు ఎవరైనా విపత్కర పరిస్థితుల్లో కానీ, అత్యవసర పరిస్థితుల్లో గానీ ఉంటే వారు నేరుగా మహిళా.. మీకోసం కార్యక్రమానికి సంబంధించిన టోల్ ఫ్రీ నెంబర్ 9746 414651కు గాని, లేదంటే 112కు గానీ ఫోన్ చేస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటారన్నారు. మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ భవిష్యత్తులో పోలీస్‌శాఖ తరపున మహిళల రక్షణ కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టి మహిళలకు భరోసా కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కమిషనర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, మహిళా పోలీస్ సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యారు.

భక్తజనంతో పులకించిన పుణ్యక్షేత్రాలు



- అమరావతి, కోటప్పకొండ, పెదకాకాని ఆలయాలను సందర్శించిన భక్తులు
- సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు

8

ప్రకృతి వరి.. నో వర్రీ

- గింజ పాలు దశలో పడిపోకుండా ఉన్న పైరు
- గుంటూరు జిల్లాలో 12 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ వరి సాగు



పొలం రాసివ్వాలంటూ బెదిరిస్తున్నారు

- 46వ రోజు ప్రజాదర్బార్‌లో విన్నపాల వెల్లువ

6

నేటి విద్యార్థులే.. రేపటి శాస్త్రవేత్తలు

- సత్తెనపల్లిలో రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక, చిత్రకళ ప్రదర్శన

భర్త ఇంటి ముందు భార్య నిరసన



పొన్నూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగం సంపాదించి స్థిరపడాలని అనుకున్న భార్యభర్తల మధ్యన వీసా నిరాకరణతో కాపురంలో కలహాలు చెలరేగి భర్త ఇంటి ముందు భార్య నిరసన దీక్షకు దిగిన సంఘటన పొన్నూరు మండలం ఆరెమండ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. కట్టెంపూడి గ్రామానికి చెందిన గోపిశెట్టి మౌలిక అనే యువతికి ఆరెమండ గ్రామానికి చెందిన గరిగంటి మొగలాయి బాబుకు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఎంబీఏ చదువుకున్న మౌలిక ఆస్ట్రేలియాలో స్థిరపడాలని, ఆమె ద్వారా భర్త కూడా ఆస్ట్రేలియా వెళ్లాలని ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే మౌలికకు రెండు సార్లు వీసా నిరాకరణకు గురైంది. విదేశాల్లో ఉద్యోగాన్వేషణ విఫలం కావడంతో అత్తింటి వారి నుంచి వేధింపులు ప్రారంభమైనట్లు ఆరోపిస్తున్నారు. ఇటీవల మొగలాయి బాబు తన భార్య మౌలికకు సంబంధించిన దుస్తులు, సామగ్రి పుట్టింటికి పంపించివేయటంతో అనుమానం వచ్చిన మౌలిక కుటుంబ సభ్యులు మొగలాయి బాబును నిలదీశారు. వివాదం చెలరేగటంతో మౌలిక తన భర్తను నిలదీయటానికి ఆరెమండ వెళ్లగా మొగలాయి బాబు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయినట్లు మౌలిక ఆరోపించింది. భర్త ఇంటి ముందే టెంట్ వేసి కుటుంబ సభ్యుల సహకారంతో నిరసనకు దిగింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని మౌలికకు చెప్పారు.

పొలం రాసివ్వాలంటూ బెదిరిస్తున్నారు

● 46వ రోజు ప్రజాదర్బార్‌లో విన్నపాల వెల్లువ

తాడేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ 46వ రోజుకు చేరుకుంది. సోమవారం ఉండవల్లి కరకట్ట వద్ద లోకేశ్ నివాసంలో నెల రోజుల విరామం అనంతరం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు అర్జీదారులు భారీగా విచ్చేసి నియోజకవర్గ, రాష్ట్ర స్థాయి సమస్యలు విన్నవించారు. అందరి విజ్ఞప్తిని పరిశీలించిన లోకేశ్ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మంగళగిరి నియోజకవర్గం నుంచి..

కుటుంబ అవసరాల కోసం తనఖా పెట్టిన తమ 3.10 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని అన్యాయం చేశారని తాడేపల్లికి చెందిన జి.కృష్ణకుమారి మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. స్త్రీధనం కింద తల్లిదండ్రులు చిలువూరులోని 3.10 ఎకరాల భూమిని రాసివ్వగా ఆర్థిక ఇబ్బందులు, పిల్లల చదువు నిమిత్తం ఇప్పటంకు చెందిన ఎం. మధుసూదన్‌రెడ్డి దగ్గర తాకట్టు పెట్టి కరోనా సమయంలో తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లించలేక పోయామన్నారు. ఇప్పుడు వడ్డీతో సహా మొత్తం చెల్లిస్తామని, తమ భూమి పత్రాలు అప్పగించాలని కోరగా భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకుని మధుసూదనరెడ్డి బెదిరిస్తున్నారన్నారు. తీసుకున్న అప్పునకు పొలం రాసివ్వాలంటూ పెదవడ్లపూడికి చెందిన అన్నే కృష్ణహర్ష, కృష్ణవినోద్, వైసీపీ నేత దేవినేని అవినాష్ పేర్లు చెప్పి బెదిరిస్తున్నారని చినవడ్లపూడికి చెందిన వెనిగళ్ల వెంకటశివరావు ఫిర్యాదు చేశారు. అక్రమ కేసులతో వేధిస్తుండడంతో మానసిక వేదన అనుభవిస్తున్నామని తగు న్యాయం చేయాలని లోకేశ్‌ను కోరారు. ఉన్నత చదవులు చదివిన తమ పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని తాడేపల్లికి చెందిన వి.రామకృష్ణారావు విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుడినైన తాను కుటుంబ పోషణ కోసం ఏదైనా చిన్న వ్యాపారం చేసుకునేందుకు ఆర్థికసాయం చేయాలని యర్రబాలెంకు చెందిన ఎం.నాగేశ్వరరావు, కోరారు. పరిశీలించి తగు న్యాయం చేస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు.



దివ్యాంగుని నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న లోకేశ్

రాష్ట్రస్థాయి విజ్ఞప్తులివే...

వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అయిన తన భర్త గత ప్రభుత్వ అండతో టీడీపీ కూటమి నేతలపై ఇష్టానుసారంగా పోస్టులు పెట్టారని, ఇదేమని ప్రశ్నించినందుకు తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏలూరు జిల్లా శ్రీరామవరానికి చెందిన కామిరెడ్డి జయశ్రీ ఫిర్యాదు చేశారు. తన భర్త వెంకట నరసింహారావుపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసనపల్లిలో తన 0.92 ఎకరాలకు పట్టాదార్ పాస్‌పుస్తకం మంజూరు చేయాలని, దివ్యాంగుడినైన తాను అధికారుల తప్పిదంతో పాస్‌బుక్ కోసం పదేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని చెప్పారు. మీ సేవా ఆపరేటర్లను తగిన విధంగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ మీ సేవా ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం పలువురు దివ్యాంగుల నుంచి లోకేశ్ వినతిపత్రాలు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి: ఎమ్మెల్యే జేబీఆర్



ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుతో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

కారంపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి అన్నారు. స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అండర్-14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు సోమవారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు విజయం సాధించడం ఆనందంగా ఉందనీ, ఆ జట్టులో కారంపూడి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఉండడం ఎంతో గర్వకారణమన్నారు. క్రీడల ద్వారా ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. బాలుర విభాగంలో గెలుపొందిన ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టును అభినందించి బహుమతులు అందించారు.

5 పాయింట్ల తేడాతో విజయం..

కారంపూడి బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అండర్ - 14 రాష్ట్రస్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు సోమవారంతో ముగిశాయి. బాలుర విభాగంలో ఫైనల్స్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్టుపై 5 పాయింట్ల తేడాతో గెలుపొందింది. బాలికల విభాగంలో ఫైనల్స్‌లో చిత్తూరు జిల్లా జట్టు శ్రీకాకుళం జట్టుపై గెలుపొందింది. విజేతలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

తేమ సాకు.. రైతుకు షాకు

(5పేజీ తరువాయి)

గుబులుతో కోత కోయటం ఆలస్యంగా ధాన్యాన్ని చేను నుంచి దాటించేస్తున్నారు. అయితే ఇక్కడే తేమ శాతాలతో చిక్కు వచ్చిపడింది.

బస్తాకు రూ. 200పైన ఎదురు వసూళ్లు

రైతు పండించిన ధాన్యం అమ్మితే కొన్న వ్యాపారి కానీ, మిల్లర్లు కానీ రైతుకే డబ్బు చెల్లించటం సహజం. అయితే ఇప్పుడు పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉంది. తాను పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్ముకోవాలంటే ఎదురు డబ్బు కట్టాల్సి వస్తోంది. వరి కోతలు మొదలయిన తరుణంలో ధాన్యం మద్దతు ధరను ప్రభుత్వం 75 కిలోల బస్తా ఎ గ్రేడ్ రకానికి రూ. 1740, సాధారణ రకం ధాన్యానికి రూ. 1725గా ధర నిర్ణయించింది. అదే బయట మార్కెట్‌లో అయితే యంత్రాలతో కోసిన ధాన్యానికి ఎంత తేమ ఉన్నా బస్తా రూ. 1300 నుంచి రూ. 1400 వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర దీనికి మించి ఉండటంతో రైతులు కొనుగోలు కేంద్రాలకే అమ్మేందుకు ఇష్టపడుతున్నారు. అనుకున్నట్టే మార్కెటింగ్ శాఖ చూపిన ప్రకారం ధాన్యం అమ్మేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. అయితే దీనికి సంబంధించిన ప్రక్రియ అంతా బాగానే ఉన్నా, తీరా మిల్లర్ దగ్గరకు వెళ్లే సరికి రైతుకు సమస్య ఎదురవుతోంది. తేమ 17 శాతం లోపు ఉంటే మాత్రం ఏ ఇబ్బందీ పెట్టటంలేదు. సమస్యంతా తేమ ఎక్కువగా ఉండే ధాన్యానికే. 18 నుంచి 21 శాతం వరకు తేమ ఉంటుండటంతో మిల్లర్లు కొనుగోలు చేయమని చెప్పకుండా, రైతుల నుంచి ముందస్తుగానే వసూళ్లకు దిగుతున్నారు. తేమ శాతం 17 నుంచి 19 శాతం ఉంటే బస్తాకు రూ. 200 చొప్పున, 20 నుంచి 21 శాతం తేమ ఉంటే రూ. 300పైన ఎదరు కట్టాలని రైతుల నుంచి నిలబెట్టి వసూలు చేస్తున్నారని, చెబుతున్నారు.


బస్తాకు రూ. 200 నుంచి రూ. 300 ఎదురు కట్టాల్సి రావటం ఇబ్బదిగా ఉందని, అదే ప్రభుత్వమే రేటులో కోత విధిస్తే, మిల్లర్లకు ఎదురు కట్టే పరిస్థితి ఉండదని, పైగా వారు మద్దతు ధరలో కోత కోసి దోపిడీ చేయకుండా తెరపడుతుందని, రైతులకు మేలు జరుగుతుందనేది రైతుల మాట. 75 కిలోల బస్తాకు ఎంత తేమ ఉంటే ఎంత తరుగుదల ఉంటుందనే అంశాన్ని వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలు సమన్వయంతో నిర్ణయించి రేటు నిర్ణయిస్తే చాలావరకు మేలు జరుగుతుంది. రైతుల నిలువుదోపిడీ లేకుండా పోతుంది. త్వరలో రైతు సంఘాల నాయకులు కూడా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి, పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ దగ్గరకు తీసుకువెళ్లాలనే ఆలోచనకు వచ్చినట్టు చెబుతున్నారు. దీనిపై మరోసారి పునరాలోచించాలనేది రైతుల విన్నపం.

నేటి విద్యార్థులే.. రేపటి శాస్త్రవేత్తలు

సత్తెనపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ, అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ అన్నారు. పల్నాడు జిల్లా రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక, చిత్రకళ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు బాలుర పాఠశాల ప్రిన్సిపల్ జాన్‌సన్, బాలికల పాఠశాల ప్రిన్సిపల్ శైలజ అధ్యక్షత వహించారు. సభలో ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ మేధాశక్తికి, పేదరికానికి సంబంధం లేదన్నారు. చాలా మంది మేధావులు గురుకులాల్లో విద్యను అభ్యసించి ఐఏఎస్, ఐపీఎస్‌లుగా కొనసాగుతున్నారన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతను గుర్తించి వారిని ప్రోత్సహించి భావి తరాలకు మంచి శాస్త్రవేత్తలను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యతను గుర్తించి వారికి ఆత్మస్థైర్యాన్ని కల్పించటానికి ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను గురుకుల పాఠశాలలో ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చన్నారు. అనంతరం ప్రసన్న వెంకటేష్, అరుణ్ బాబు, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు విద్యార్థులచే ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 190 గురుకుల పాఠశాలల విద్యార్థులు 160 మంది తమ ప్రదర్శనలను ప్రదర్శించారు. గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడదాం

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ స్ఫూర్తిని, నైతికతను నిలబెట్టాల్సిన ఆవశ్యకత ప్రధాన రాజకీయ పార్టీలు, మేధావులు, కోట్లాది ప్రజలపై ఉందని న్యాయ శాస్త్ర నిపుణులు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రంగయ్య పేర్కొన్నారు. సోమవారం గుంటూరులోని జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో ప్రధాన వక్తగా ఆయన పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఆచార్య రంగయ్య, వేదిక పైన మాజీ మంత్రి వరప్రసాద్, లక్ష్మణ రెడ్డి

ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ దేశ ప్రజల్లో ఒక్క శాతం చేతిలో 50 శాతం సంపద కేంద్రీకృతమైందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించటం, దళిత, గిరిజన, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తూ అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరచడం అభినందనీయమన్నారు. శాసనమండలి సభ్యులు కె.యస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ జడ్జీలకు పదవీ విరమణ కాగానే రాజకీయ పదవులు కడబెట్టే సంప్రదాయం మంచిది కాదని, ఇది న్యాయవ్యవస్థపై నమ్మకం సన్నగిల్లేలా చేస్తుందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఇటీవల కాలంలో ప్రభుత్వ అధినేతలు రాజ్యాంగబద్ధ పాలనకు బదులు రాజకీయ పాలన వైపు మొగ్గు చూపుతున్నారని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.95 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోండి



ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా- గుటూరు జిల్లాల పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తొలివిడత ఓటరు నమోదు ప్రక్రియ నవంబరు 6తో ముగియడంతో చాలా మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోలేకపోయారని, దీంతో ఎన్నికల కమిషన్ మరోమారు అవకాశం కల్పించిందని తెలిపారు. డిసెంబరు 6లోపు మరోసారి ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఓటర్ల జాబితాలో దొర్లిన తప్పొప్పులను కూడా ఇప్పుడు సరిదిద్దుకోవచ్చని తెలిపారు. ఓటరుగా నమోదు కావాల్సిన వారు ఫారం-18ని పూర్తి చేసి సమీపంలోని కూటమి కార్యాలయంలో ఇవ్వవచ్చని తెలిపారు. ఆన్‌లైన్లో కూడా నమోదు చేసుకోవచ్చని లేదా పూర్తి చేసిన పత్రాలు తహసీల్దారు కార్యాలయంలో ఇచ్చి రసీదు పొందవచ్చని తెలిపారు. గుంటూరు లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని తన ప్రధాన కార్యాలయంలో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకూ ఓటు నమోదు ప్రక్రియ ఉంటుందని, అర్హులైనవారంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అద్దె బస్సులో రూ.లక్ష చీర మాయం

● ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ కోడలు చీర కావడంతో తలలు పట్టుకుంటున్న ఆర్టీసీ అధికారులు

వినుకొండ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ఆర్టీసీకి చెందిన అద్దె బస్సులో సుమారు రూ.లక్ష విలువచేసే ఖరీదైన చీర మాయమైన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలను పరిశీలిస్తే.. ఈ నెల 6వ తేదీన వినుకొండకు చెందిన అద్దె బస్సు వినుకొండ నుంచి తిరుపతి వెళ్తుంది. అద్దె బస్సుకు ఒంగోలు నుంచి నెల్లూరుకు ఆర్టీసీ కార్గో ద్వారా 16 పార్శిల్స్ ఇచ్చారు. అద్దె బస్సులో పనిచేస్తున్న డ్రైవర్ 15 పార్శిల్స్‌ను కార్గోకు అందించారు. విలువైన చీరను మాత్రం ఇవ్వకపోవడాన్ని ఆలస్యంగా గుర్తించారు. ఈ చీర ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ కోడలకు చెందినది కావడంతో చీర విషయం తేల్చాలని ఆర్టీసీ అధికారులు ఆదేశించారు. బస్సుకు డ్రైవర్‌గా పని చేసిన వ్యక్తి ఫోన్ నంబరు పనిచేయకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు

గుంటూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రబీ సాగుకు రైతులు సిద్ధం అవుతున్న తరుణంలో కాంప్లెక్స్ ఎరువులు కొండెక్కాయి. కాంప్లెక్స్ ఎరువుల ధర బస్తాకు రూ.100 పెరిగింది. 20:20:0:13 గతంలో రూ.1200 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.1300కు చేరింది. 14:35:14 గతంలో రూ.1700 వరకు ఉండగా, ప్రస్తుతం రూ. 1800కు చేరింది. 28:28:0 గతంలో రూ.1700 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.1800 వరకు చేరింది. మిగిలిన ఎరువుల ధరలు యథాతథంగా ఉన్నట్లు తెలిసింది.

నడవకుండా 'మోటు'గా చంకనెక్కి..



ఈ రోజుల్లో మనుషులకంటే 'కుక్కలే' రాజభోగాలు అనుభవిస్తున్నట్లుంది. ఈ చిత్రమే అందుకు తార్కాణం. పిల్లలను చంకనేసుకున్నట్లు కుక్కని మోస్తూ కనిపిస్తున్న వ్యక్తి పేరు కోటేశ్వరరావు. ఊరు ప్రత్తిపాడు మండలంలోని కొండెపాడు. అతను ఎత్తుకున్న కుక్క పేరు మోటు. మూడు రోజులుగా జ్వరం వస్తుంటే ప్రత్తిపాడులో ఉన్న పశువుల డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్తున్నాడు. అది నడవకపోతుండటంతో ఇలా ఎత్తుకొని ఆటో కోసం ఎదురు చూస్తూ కనిపించాడు.

- గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి

రేపు యూపీఎస్సీ ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష

గుంటూరు(విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ)కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారని, ఇందుకు అర్హులైన అభ్యర్థుల్ని ఎంపిక చేసేందుకు ఈ నెల 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మయూరి సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 10.30 గంటలకు గుంటూరు రాజాగారితోటలో బీసీ స్టడీ సర్కిల్ నిర్వహించే పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

కారం మిల్లుల్లో జీఎంసీ అధికారుల తనిఖీలు

● జీరోలో మిరపకాయలు కొనుగోలు చేయొద్దని ఆదేశాలు

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెండు కారం మిల్లుల్లో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. 'అక్రమ వ్యాపారాలు అరికట్టేదెలా?' అనే శీర్షికతో సోమవారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు స్పందించారు. ఆయన తన సిబ్బందితో కలిసి సాయంత్రం యార్డు సమీపంలోని రెండు కారం మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లు యజమానులతో మాట్లాడారు. కారం తయారీకి వినియోగించే మిరప కాయలను యార్డులో అధికారికంగా కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఎవరి వద్దనైనా జీరోలో కొనుగోలు చేస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

● మిర్చియార్డులో రైతుల సౌకర్యార్థం ఉదయం 7 గంటలకు సైరన్ మోగిన తర్వాత ట్రేడింగ్ ప్రారంభించే విధానాన్ని పునరుద్ధరించారు. సోమవారం ఉదయం యార్డు అధికారులు సరిగ్గా ఏడు కాగానే 30 సెకన్ల పాటు సైరన్ మోగించారు. యార్డు అంతా వినిపించేలా మైక్ సిస్టమ్‌ని ఏర్పాటు చేశారు.

● మిర్చియార్డులో దిగుమతి వ్యాపారి టోకరా పెట్టడంతో అతడికి రుణం ఇచ్చిన ఎగుమతి వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ఎగుమతిదారులకు దాదాపుగా రూ.25 కోట్లకు పైగా బకాయిలు పడినట్లు లెక్కలు తేల్చారు. యార్డులో ఇటీవలే లైసెన్సు రెన్యువల్ కూడా చేసుకున్న ఆ వ్యాపారి, అతని భాగస్వామి ఆదివారం నుంచి ఇళ్లకు తాళం వేసి అదృశ్యం కావడంతో ఎక్స్‌పోర్టర్లు పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

సమగ్ర కులగణన ప్రక్రియను ప్రారంభించాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జాతీయస్థాయిలో తలపెట్టిన జనగణనతో పాటే సమగ్ర కులగణన జరపాలని, ఆ తరువాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతి కుమార్ కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన అనంతరం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు పి.మహేష్, ఎ.నాగమల్లేశ్వరరావు, కె.అశోక్, కాగితల స్వాతి పాల్గొన్నారు.

కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తు అంధకారమే : ఎస్ఐ రమేష్

గుంటూరు(విద్య), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యువత సన్మార్గంలో పయనించేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని, ఒక్కసారి కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తు అంధకారమౌతుందని కొత్తపేట ఎస్ఐ రమేష్ హెచ్చరించారు. యువజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏసీ కళాశాలలో సైబర్ సెక్యూరిటీస్, ఈవ్‌టీజింగ్, ఉమెన్ ట్రాఫికింగ్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. చదువుకునే వారి పేర్లు ఎఫ్ఐఆర్‌లో ఒక్కసారి నమోదైతే ఇక వారికి భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగానికి బానిసలుగా మారితే అనేక సమస్యలు వస్తాయని మానసిక వైద్యులు డాక్టర్ డి.రవిచంద్ర, శ్రీధర్‌బాబు వివరించారు. కార్యక్రమంలో ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ కొమ్మాలపాటి మోజస్, యువజన సంక్షేమశాఖ మేనేజర్ బి.రాధిక పాల్గొన్నారు.

న్యాయస్థానంలోనే తేల్చుకుంటాం

● మాజీ మంత్రి అంబటి రాంబాబు

గుంటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో పోస్టులపై కేవలం వైసీపీ కార్యకర్తలను మాత్రమే అరెస్టు చేస్తున్నారని, దీనిపై న్యాయస్థానంలోనే తేల్చుకుంటామని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. సోషల్ మీడియాలో పోస్టులపై వైసీపీ నాయకులు చేసిన ఫిర్యాదులను పట్టించుకోకుండా కేవలం వైసీపీ కార్యకర్తలను మాత్రమే అరెస్టు చేస్తున్నారంటూ సోమవారం ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు, మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పోలూరి వెంకటరెడ్డి, నూనె ఉమామహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు మల్లవరపు రమ్య, రాజలత, కృష్ణమాచారి తదితరులున్నారు.

అలరించిన శివలీలలు హరికథాగానం

గుంటూరు(తూర్పు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం వేదవతి భాగవతారిణిచే శివలీలలు హరికథా గానం కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేదవతి భాగవతారిణి శివలీలల విశిష్టతను భక్తులకు పలు కీర్తనల ద్వారా వివరించారు.

విద్యుత్ ఛార్జీల పెంపును విరమించుకోవాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును తిప్పి కొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. సోమవారం బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. వామపక్ష నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 5 ఏళ్లల్లో రూ.32వేల కోట్లు విద్యుత్ భారం మోపగా, కూటమి ప్రభుత్వం ఐదు నెలల్లోనే రూ.17,898 కోట్ల భారం మోపిందని విమర్శించారు. సౌరవిద్యుత్ అమ్మకాలలో జరిగిన అక్రమాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి అదానిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వామపక్ష నాయకులు నాగేశ్వరరావు, వి.నరసింహరావు, కోటేశ్వరరావు, నేతాజి, అరుణ్, అప్పారావు పాల్గొన్నారు.

అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
● ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 166 అర్జీలు
● సకాలంలో పరిష్కరించాలంటూ ఆదేశాలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన జేసీ భార్గవ్‌తేజ తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్జీ బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లితే సంబంధిత అధికారికి మెమో జారీ చేస్తామని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 166 అర్జీలు వచ్చాయి. జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో కే.శ్రీనివాసరావుతో కలసి ఆమె అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీ పరిష్కరించని నేపథ్యంలో అధికారుల నుంచి సంజాయిషీ, సరైన సమాధానం రాకపోతే అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన జడ్పీ సమావేశంలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, శిలాఫలకాలపై పేర్లు లేవని సభ్యులు చెప్పిన నేపథ్యంలో అధికారులు విధిగా ప్రొటో కాల్ పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీవో శేషశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ శంకర్, డీఎస్‌వో కోమలి పద్మ, డీసీవో వీరాచారి, డీఈవో రేణుక తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లను పునరుద్ధరించాలి

గత ప్రభుత్వంలో పలు కారణాలతో తొలిగించిన పెన్షన్‌లను పునరుద్ధరించాలని కోరుతూ విభిన్న ప్రతిభావంతులు ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చారు. వారి నుంచి నేరుగా కలెక్టర్ నాగలక్ష్మి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా 90 శాతం శారీరక వైకల్యంతో ఇబ్బంది పడుతున్నానని, తల్లిదండ్రులు చనిపోయారని, బ్రాడీపేటలో అనాథ ఆశ్రమంలో ఉంటున్నానని ఇంతవరకు పెన్షన్ లేదని నగరానికి చెందిన పులిపాక శివకుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. జీజీహెచ్‌లో 90శాతం వైకల్యం నమోదు చేయలేదని దీంతో పెన్షన్ అందడం లేదని, పోలియో కారణంగా సదరన్ సర్టిఫికెట్ ఇవ్వలేమని జీజీహెచ్ సిబ్బంది చెబుతున్నారని, దాదాపు ఏడాది పాటు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని రేపల్లె పట్టణంలోని రైలుపేటకు చెందిన శాసన పాములు కలెక్టర్ వద్ద వాపోయాడు. ఈ సందర్భంగా సాంకేతిక సమస్యలను తొలగించి వారికి పెన్షన్ అందేలా కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

రత్నగిరి నగర్‌కు తాగునీరు అందించాలి

స్థానిక పలకలూరు రోడ్డులోని రత్నగిరినగర్‌కు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ కాలనీవాసులు అర్జీ అందజేశారు. 200 పైగా కుటుంబాలు ఉన్నాయని, కానీ తాగునీటి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మున్సిపల్ వాటర్ ట్యాంకు 10 రోజులకు ఒకసారి వస్తుందని, దీంతో ఒక్కొక్క ఇంటికి ఒక్క డ్రమ్ము నీరు మాత్రమే వస్తుందని వాపోయారు. దీనిపై స్థానిక అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదని అన్నారు. తక్షణమే ఇంటింటికి కుళాయి కలెక్షన్ ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నాయకులు కే.శ్రీనివాసరావు, ఎస్కే ఖాసిం వలి, స్థానికులు సైదా, లక్ష్మణరావు మౌలాలి, వెంకటమ్మ, బుజ్జి, సౌభాగ్యం ఉన్నారు.

ఈద్గాకు స్థలాన్ని కేటాయించాలి

స్థానిక గోరంట్ల, అన్నపూర్ణనగర్, నగరాలు, ఇన్నర్‌రింగ్ రోడ్డు, విద్యానగర్, జేకేసీ కళాశాల రోడ్డు, ద్వారకానగర్ ముస్లింలకు ఈద్గా లేనందున స్థలాన్ని కేటాయించాలని మస్‌జీద్ ఎ హీరా కమిటీ అధ్యక్షుడు షేక్ సుభాని అర్జీ అందజేశారు.

ప్రభుత్వ స్థలంలో ఉన్న కారు షెడ్‌లను తొలగించాలి

ప్రభుత్వ స్థలంలో తమ కార్లు కోసం వైసీపీ నాయకులు షెడ్‌లను నిర్మించారని వాటిని వెంటనే తొలగించాలని గుంటూరు రూరల్ మండలం తోకవారిపాలెం గ్రామానికి చెందిన నల్లగొండ కోటేశ్వరరావు అర్జీ అందజేశారు.

వలంటీర్లకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలి

వలంటీర్లకు రావాల్సిన జీతాలు విడుదల చేయాలని కోరుతూ వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య అర్జీ అందజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10వేల జీతంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటించాలి : కలెక్టర్

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిబంధనల మేరకు విధులకు హాజరుకాని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ప్రతి వారం ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో లే అవుట్ల వారీగా సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులతో పాటు, ఇంటర్ చదివే విద్యార్థులకు అపార్ ఐడీ క్రియేట్ అయ్యేలా విద్యాశాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు చర్యలు తీసుకో వాలన్నారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ, తెనాలిలో పైలట్ ప్రాజెక్ట్ సర్వే నిర్వహించడం జరుగుతుంది. ఎంఎస్ఎంఈ ఎంటర్‌ప్రెన్యూర్ డిసెంబర్ 29 లోపల సర్వే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సీపీవో శేషశ్రీ, హౌసింగ్ పీడీ ప్రసాదు, డీపీవో సాయికుమార్, డ్వామా పీడీ శంకర్, డీఈవో రేణుక, ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, ఏపీఎంఐపీ పీడీ వజ్రశ్రీ, భూగర్భ జలవనరుల శాఖ పీడీ వందనం పాల్గొన్నారు.



ప్రదర్శన తిలకిస్తున్న డీవైఈవో వెంకటేశ్వరరావు

పర్యావరణ సమతుల్యత కాపాడాల్సిన బాధ్యత అందరిది

● డీవైఈవో వెంకటేశ్వరరావు
● ఆకట్టుకున్న జిల్లాస్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్

గుంటూరు(విద్య), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమతుల్యతను కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందని డిప్యూటీ డీఈవో వెంకటేశ్వరరావు అన్నారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న పరీక్షాభవన్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ వారి సౌజన్యంతో జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్-2024ను విద్యాశాఖ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీవైఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ, నార సంచులను ఉపయోగించాలని సూచించారు. 'చెత్త నుంచి సంపద తయారు చేయుట' అనే అంశంపై ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. ఇందులో విద్యార్థులు వివిధ రకాల నమూనాలను తయారుచేసి ప్రదర్శించారు. పర్యావరణ కాలుష్యం, దానిని తగ్గించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశంపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 94 పాఠశాలల నుంచి 225 మంది పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు రమణయ్య, జ్యోతికిరణ్, నాగేంద్రమ్మ, డీసీఈబీ సెక్రటరీ తిరు మలేష్, ఉర్దూ పాఠశాలల డీఐ మొహమ్మద్ ఖాసిం, ప్రధానోపాధ్యాయులు జిలాని బాషా, వసుంధర, మణికుమార్, శ్రీనివాసరావు, రిసోర్స్‌పర్సన్ ఆయేషా సుల్తానా, శివశంకర్, అప్పారావు, శాంతిప్రియ, గంగాధర్, శ్రీనివాసరావు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు

పోటీల్లో విజేతల వీరే..

పోటీల్లో ప్రదర్శన విభాగంలో ప్రథమ బహుమతి కొలకలూరు జడ్పీ ఉన్నత పాఠశాల, డ్రాయింగ్‌లో మేడికొండూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. ద్వితీయ బహుమతిలు కాకుమాను జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల (ఎగ్జిబిషన్), ప్రభుత్వ ఉర్దూ బాలికల పాఠశాల చౌత్రాసెంటర్ గుంటూరు (డ్రాయింగ్) గెలుచుకున్నారు. ఇంకా తృతీయ బహుమతుల్ని దుగ్గిరాల జడ్పీ ఉన్నత పాఠశాల (ఎగ్జిబిషన్), ఎస్‌కేబీఎం కార్పొరే షన్ ఉన్నత పాఠశాల గుంటూరు (డ్రాయింగ్) విద్యార్థులు గెలుచుకున్నారని జిల్లా సైన్స్ అధికారి గౌసుల్‌మీరా వెల్లడించారు.

రాజ్యాంగంపై గౌరవ భావంతో ఉండాలి : డీఈవో

గుంటూరు(విద్య), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంపై విద్యార్థులు గౌరవ భావంతో ఉండాలని డీఈవో సీవీ రేణుక సూచించారు. భారత రాజ్యాంగం ఏర్పాటు చేసి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పాత బస్టాండు సెంటర్‌లోని పరీక్షాభవన్‌లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు రాజ్యాంగంలో సమాన హక్కులు కల్పించారని అందువల్లే అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని డీఈవో రేణుక తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని సమర్థవంతంగా వినియోగించుకుని పౌరులు బాధ్యతతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఈవో పీ వెంకటేశ్వరరావు, డీసీఈబీ కార్యదర్శి ఏ తిరుమలేష్, ఉర్దూ డీఐ ఎస్‌కేఎండీ ఖాసిం, ఎంఈవోలు జ్యోతికిరణ్, నాగేంద్రమ్మ, అబ్దుల్ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీల్లో విజేతలు

గుంటూరు(విద్య), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జోనల్ స్థాయిలో(గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) జరిగిన వ్యాసరచన, వక్తృత్వం, చర్చ, క్విజ్, దేశభక్తి గీతాలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి గుంటూరు పరీక్షాభవన్‌లో బహుమతులు అందజేశారు.

స్త్రీలపై వివక్ష విడనాడితేనే అన్ని రంగాల్లో ప్రగతి



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

గుంటూరు(విద్య), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్త్రీలపై వివక్ష విడనాడి పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించినప్పుడే అన్ని రంగాల్లో ఆర్థిక ప్రగతి సాధ్యమౌతుందని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కళాశాలలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జగర్లమూడి మురళీమోహన్, జగదీష్ కె మద్దినేని, ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ అకడమిక్ అండ్ ఆర్అండ్‌డీ డైరెక్టర్ కే రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ బ్యాండ్ పోటీల్లో విజేతలను అభినందించిన డీజీపీ



పోలీసు అధికారులతో ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : 25వ అఖిల భారత పోలీసు బ్యాండ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఏపీ పోలీస్ అధికారులను డీజీపీ ద్వారకా తిరుమల రావు అభినందించారు. ఈ మేరకు నాగాలాండ్ రాష్ట్రంలో దీమాపూర్‌లో అస్సాం రైఫిల్స్ 25వ అఖిల భారత పోలీసు బ్యాండ్ పోటీలను ఏడు రోజుల పాటు నిర్వహించింది. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి దేశం మొత్తం మీద 24 టీమ్స్ పాల్గొన్నా యి. ఆంధ్రప్రదేశ్ పోలీస్ బిగిల్ కాల్ పోటీలలో మూడవ స్థానం గెలుచు కొని కాంస్య పతకం సాధించిన ఏపీ పోలీస్ అధికారుల బృందాన్ని డీజీపీ ద్వారకా తిరుమల రావు అభినందించారు. ఐజి కే.వి.మోహన్ రావు క్రీడలు నేతృత్వం లోని అధికారులతో కూడిన బృందం ఇందులో పాల్గొని మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది.

ఎస్ఐ ఉద్యోగోన్నతికి రాతపరీక్షలు

గుంటూరు రేంజ్‌లో ఏఎస్ఐ నుంచి ఎస్ఐ ఉద్యోగోన్నతికై సోమవారం గుంటూరులోని పోలీస్ కార్యాలయంలో రాత పరీక్షలు నిర్వహించారు. రాత పరీక్షలను సౌత్ పోస్టల్ జోన్ గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాఠీ పర్యవేక్షించారు. ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్, కమాండంట్ ఎస్పీ నగేష్‌బాబు, అదనపు ఎస్పీ(అడ్మిన్), ప్రకాశం జిల్లా నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో గుంటూరు రేంజ్ పరిధిలోని గుంటూరు, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు, పల్నాడు జిల్లాల్లో పనిచేస్తున్న 58 మంది ఉద్యోగోన్నతి కొరకు శాఖపరమైన పరీక్షలు నిర్వహించారు.

ముగిసిన ఇంటర్ రీజియన్ క్రికెట్ టోర్నమెంట్

గుంటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుంటూరు రీజియన్ హైదరాబాద్ జోన్ కోసం సర్ సొరాబ్జీ పోచ్కనావాలా మెమోరియల్ ఇంటర్ రీజియన్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. గుంటూరులో ఈనెల 23, 24 తేదీల్లో జరిగిన ఈ టోర్నీని హైదరాబాద్‌జోన్ జోనల్ హెడ్ ధరాసింగ్ నాయక్ ప్రారంభించారు. సతీష్ నేతృత్వంలో విజయవాడ రీజియన్ విజేతలుగా ఏఎస్ఎన్ మూర్తి సారథ్యంలోని విశాఖపట్నం రీజియన్ రన్నరప్‌గా నిలిచాయి. పలు జట్లు క్రీడా స్ఫూర్తితో హాజరైన ఈ టోర్నమెంట్‌ను గుంటూరు రీజనల్ హెడ్ వెంకటేశ్వరరావు విజయవంతంగా నిర్వహించారు.

విశాఖ బీచ్‌లో గుంటూరు పిల్లలు



పారిపోయి వచ్చిన పిల్లలను త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించిన పోలీసులు

విశాఖపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నుంచి పారిపోయిన వచ్చిన ఇద్దరు చిన్నారులను సోమవారం పోలీసులు పట్టుకుని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఆర్కే బీచ్‌లోని మురీమిక్సర్ బండి వద్ద సుమారు పదకొండేళ్ల వయసు ఇద్దరు పిల్లలు సంచరిస్తుండగా తిరుగుతుండగా, అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ శ్రీనివాసరావు వారివద్దకు వెళ్లి ఆరా తీశారు. తాము గుంటూరుకు చెందిన ఎస్కే హసీమ్(11), అబ్దుల్ రఫీలుగా పిల్లలు చెప్పారు. 7వ తరగతి చదువుతున్న ఆ చిన్నారులు ఇంట్లో పెద్దలకు చెప్పకుండా విశాఖ వచ్చినట్టు పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు ఆ ఇద్దరు పిల్లల్ని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి వారి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలు



అరండల్‌పేట శివాలయంలో దీపారాధన చేస్తున్న మహిళలు

గుంటూరు(తూర్పు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాలుగో కార్తీక సోమవారంను మహిళలు భక్తిశ్రద్ధలలో నిర్వహించారు. రవీంద్రనగర్, కొత్తపేట, అరండల్‌పేట, బ్రాడీపేట, ఆర్ అగ్రహారం, పాతగుంటూరు తదితర శివాలయాల్లో భక్తులు స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. కార్యక్రమాల్ని ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగడిగుంట మంత్రి వారి వీధిలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో కార్తీక సోమవారం సందర్భంగా దీపోత్సవాన్ని నిర్వహించారు.

ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్‌లో గుంటూరు సర్కిల్ ఘనత

గుంటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ లాంటెనిస్ టోర్నమెంట్‌లో గుంటూరు సర్కిల్ క్రీడాకారులు ప్రతిభ చూపారు. ఛత్తీస్‌ఘడ్‌లో ఈనెల 22 నుంచి 25 వరకు జరిగిన టోర్నమెంట్‌కి రాష్ట్రం తరఫున సీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌ఛార్జ్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, మహేష్‌లు అద్భుత ప్రతిభ చూపి ఓపెన్ డబుల్స్‌లో ద్వితీయ స్థానంను కైవసం చేసుకున్నారు. ఇందులో ఇన్‌ఛార్జ్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, తెనాలి లైన్‌మెన్ మహేష్ ఇద్దరూ కలసి చాలా పట్టుదలతో అద్భుతమైన ప్రతిభ చూపారు.

గుంటూరు 'పశ్చిమ'లో నిరంతర జాబ్ మేళాలు

● ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి 15 రోజులకు ఒకసారి చొప్పున నిరంతరాయంగా జాబ్‌మేళా నిర్వహిస్తామని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆమె ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువత ఉద్యోగ కల్పన కోసం తన కార్యాలయంలో ఒక విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు. నియోజకవర్గంలో నిరుద్యోగ యువత అందరికీ ఉద్యోగాలు లభించే వరకు నిరంతరం జాబ్ మేళాలు నిర్వహిస్తూనే ఉంటామని ఆమె తెలిపారు. జాబ్‌మేళాకు హెచ్‌ఆర్ అండ్ కో తరఫున 5 కంపెనీల ప్రతినిధులు రాగా, సుమారు 50 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. వారిలో సుమారు 30 మంది ఎంపికవగా, అదే రోజు వారికి ఆఫర్ లెటర్ ఇస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

తీరనున్న వీధికుక్కల బెడద



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు పశ్చిమ ప్రజలకు వీధి కుక్కల బెడద తీరనుందని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. అసెంబ్లీలో తాను వీధి కుక్కల సమస్యపై ప్రస్తావించానని, దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించడమే హర్షణీయమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీధికుక్కలకు గర్భధారణ నియంత్రణ శస్త్ర చికిత్సలకు ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. తమది పనిచేసే ప్రభుత్వమని మరోమారు రుజువైందని చెప్పారు.

మాజీ మంత్రి అంబటి అండతో తమ్ముడు భారీ నిర్మాణాలు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఫిర్యాదు

విజయవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి అంబటి రాంబాబును అడ్డం పెట్టుకుని తమ్ముడు అంబటి మురళీకు చెందిన ఆదిత్య ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ గుంటూరులో చేపట్టిన నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని, వాటిపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కోరారు. సోమవారం విజయవాడలోని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో బోర్డు మెంబర్ సెక్రటరీ ఐఎఫ్ఎస్ అధికారి శర్వానంద్‌కు ఆదిత్య ఇంఫ్రాటెక్ నిర్మాణాలపై పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ గుంటూరులో బజరంగ్ జూట్ మిల్ సమీపంలో ఆదిత్య ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ భారీ నిర్మాణాలపై చట్ట ఉల్లంఘనలు చేసిన వైనాన్ని పీసీబీ అధికారులకు వివరించినట్లు వెల్లడించారు. అధికారులు ఫీల్డ్ తనిఖీలు లేకుండా కళ్లు మూసుకుని ఫైర్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డీజీ సంజయ్, మాదిరెడ్డి ప్రతాప్ ఇద్దరూ ఎన్ఓసీలు ఇచ్చారని ఆరోపించారు. అపార్టుమెంట్ నిర్మాణంలో ప్లాన్‌లో ఒకలా చూపించి నిర్మాణాలు మరోలా చేపట్టారన్న విషయాన్ని స్పష్టంగా తెలిపానన్నారు. పొల్యూషన్ బోర్డు నుంచి కన్సెంట్ తీసుకోకుండా భారీ ప్రాజెక్టును ప్రారంభించారు. ఉల్లంఘనలు జరిగితే ఈసీని రుద్దు చేసే అధికారం పీసీబీకి ఉంటుందన్నారు. నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేకుండా గుంటూరులో గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ ఎలా నిర్మాణం చేపట్టారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రైల్వే, వాటర్, ఫైర్ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా భారీ అపార్టుమెంట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు వెల్లడించారు. అపార్టుమెంట్ నిర్మాణ దారులు మధ్యతరగతి ప్రజల నుంచి డబ్బులు వసూల్ చేశారని ఆరోపించారు. గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ పేరిట వైట్ కాలర్ నేరం చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించినందున చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పీసీబీ అధికారిని కోరినట్లు వెల్లడించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

● కమిషనర్ పి.శ్రీనివాసులు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధి లో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ సంగడిగుంట, శారదా కాలనీల్లో సీసీ రోడ్ల ప్యాచ్ వర్క్‌లు, నూతన డ్రైన్లను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయం లో ఎమినిటి కార్యదర్శులు అక్కడే ఉండి పరిశీలించాలన్నారు. అనంతరం చౌడవరంలోని సీఆర్ కాలనీని పరిశీలించి, శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం తీసుకోవాలని అధికారులకు సూచించారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, ఏసీపీ వెంకటేశ్వర్లు, డీఈఈ కళ్యాణరావు, ఆర్‌వోలు రవి కిరణ్‌రెడ్డి, సాదిక్‌బాషా, ఏఎంహెచ్‌వో తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారం కోసం కాల్ సెంటర్

ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం కాల్‌సెంటర్ 0863-2345103, 104, 105 నెంబర్ల కు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు.

● డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 20 ఫిర్యాదులు అందాయి. అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు.

● సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 41 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 16, ఇంజనీరింగ్ 16, రెవెన్యూ 5, పరిపాలన విభాగానికి సంబంధించి 4 ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

రోడ్లపై సంచరించే పశువులను గోశాలకు తరలిస్తాం

నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లపై సంచరించే ఆవులు, ఎద్దులు, గేదెలను సంబంధిత యజమానులు వారి సొంత ఆవరణలోనే పెంచుకోవాలని, అలా కాకుండా రోడ్ల మీదకు వదిలితే వాటిని జీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది గోశాలకు తరలిస్తారని కమిషనర్ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

కార్మికుల కుటుంబాలకు అండగా జీఎంసీ

కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగరపాలక సంస్థ అండగా ఉంటుందని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల ఇంజనీరింగ్ విభాగం ఎల్ఎల్ఆర్‌లో ఆప్కాస్ విధా నంలో విధులు నిర్వహించే షేక్ ఉమర్ మృతి చెందారని, వారి కుటుంబసభ్యులు షేక్ ముం తాజ్ బేగంకు ఎక్స్‌గ్రేషియా రూ.2 లక్షలు, మట్టి ఖర్చులు రూ.15 వేల చెక్‌లను అందించా మని తెలిపారు.

స్వచ్ఛభారత్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పాత్ర కీలకం

గుంటూరు(విద్య), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవాభావాలు కలిగిన జాతీయ సేవా పథకం వలంటీర్స్ పాత్ర సమాజంలో ఎంతో కీలకమని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో నగరంలో ముఖ్యమైన ప్రాంతాల్లో సేవలు అందించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు టీజేపీఎస్ కళాశాలలో సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ సేవాభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం, వర్శిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ వి.దివ్య తేజోమూర్తి, కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, కేనారాయణ (ఐటీసీ ఎన్ఎస్ఎస్ సొసైటీ) తదితరులు పాల్గొన్నారు.

పులిపాక హైస్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

● సోషల్ మీడియా వేదికగా 50 ఏళ్ల తరువాత కలుసుకున్న వైనం

గుంటూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పాత గుంటూరు శ్రీపులిపాక కమల హనుమం తరాయ హైస్కూల్ 1975-76 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం సోమవారం జరిగింది. బ్రాడీపేటలోని హోటల్ సింధూరిలో జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థులంతా ఆత్మీయంగా ఒకరినొకరు పలుకరించుకుంటూ ఉత్సాహంగా గడిపారు. 50 ఏళ్ళ తరువాత ఒకే వేదికపైకి చేరిన పూర్వ విద్యార్థులు తమ హైస్కూల్ రోజులను నెమరు వేసుకుంటూ సందడిగా గడిపారు. పాత మిత్రులను కలుసుకొని, ఆప్యాయంగా పలకరించుకోవటమే మాకు అసలైన విందు భోజనం ఆరగించినట్లుగా ఉందని కార్యక్రమ నిర్వాహకులు నంబూరు సుబ్బారావు, కోటేశ్వరరావు, లంకా సత్యంలు సంతోషం వ్యక్తం చేశారు. కనీసం రెండేళ్లకొకసారైన ఇలా అందరూ కలుసుకుంటే అనారోగ్యాలు దరిచేరవని పూర్వ విద్యార్థి, సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత సూపరింటెండెంట్ పి.కోటేశ్వరరావు చెప్పారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన విశ్రాంత అధికారులు (పూర్వ విద్యార్థులు) నంబురు సుబ్బారావు, పి.కోటేశ్వరరావు, లంకా సత్యం, రామసీత, కృష్ణవేణి, కృష్ణకుమారి, ఇందుమతి, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వరి.. నో వర్రీ

గింజ పాలు దశలో పడిపోకుండా ఉన్న పైరు

గుంటూరు జిల్లాలో 12 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ వరి సాగు

పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ

పరిశీలన కోసం తెలంగాణ నుంచి వచ్చిన రైతులు



పడిపోకుండా ఉన్న ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పంట

గుంటూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతికి పుడమి కూడా పులకరిస్తుంది. ఎక్కువగా రసాయనిక ఎరువులు వాడకపోవటం వల్ల భూమి కూడా కర్షకులకు సహకరిస్తుంది. గుంటూరు జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట నూతన అధ్యాయానికి నాంది పలికింది. తుపానును సైతం తట్టుకొని నిలబడిన ప్రకృతి వ్యవసాయ వరి పంట ఇప్పుడు మరో రికార్డు సృష్టించింది. గింజ పాలు పోసుకునే దశలో రసాయన ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడిన వరి పంట పూర్తిగా పడిపోగా, ప్రకృతి పద్ధతిలో సాగు చేసిన పొలాల్లో పంట ఏపుగా నిలబడి ఉండటం చూసి రైతులు, వ్యవసాయ అధికారులు ఆశ్చర్య పోతున్నారు. గుంటూరు జిల్లాలో సుమారు 12 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పైరు కీలకమైన దశలో నిలబడి ఉన్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రకటిం చారు. ఈ పంటను చూసేందుకు పక్క రాష్ట్రాల నుంచి రైతులు వందల సంఖ్యలో వచ్చిపోతున్నారు.

పెట్టుబడి తక్కువే...

ఈ ఏడాది గుంటూరు జిల్లాలో 56 వేల హెక్టార్లలో వరి సాగుచేశారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడిన పంటలకు ఎకరాకు సుమారు రూ. 26 వేల నుంచి రూ.30 వేల వరకు (కోత కూలీ కలుపుకుని) పెట్టుబడి గా పెట్టారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతి లో సాగు చేసిన పొలాల్లో పెట్టుబడి సాధారణ పొలాల తో పోల్చి ఎకరాకు రూ.10 వేల వరకు తగింది. విత్తనాలు కూడా తక్కువగా నే వాడినట్లు రైతులు చెబుతున్నారు.



పూర్తిగా పడిపోయిన రసాయన ఎరువులు వాడిన వరి పంట

కీలక దశలో పడిపోయిన పైరు

ప్రస్తుతం చాలా చోట్ల వరి కోత దశకు చేరింది. రసాయన ఎరువులు వాడిన పొలాల్లో భూమిలో పటుత్వం తగ్గి గింజ పాలు పోసుకొని ముగ్గే దశలో వరి పైరు పడిపోయింది. ఈ పొలాల్లో ఖరీఫ్ లో ఎకరాకు రెండు బస్తాల డీఏపీ, ఒక బస్తా కాంప్లెక్స్ ఎరువులు, మూడు బస్తాలు యూరియా వాడినట్లు రైతులు చెబుతున్నారు. అదీకాక రబీలో మొక్క జొన్న, జొన్న సాగు సందర్భంగా ఇబ్బడిముబ్బడిగా ఎకరాకు 10 బస్తాలకు తగ్గకుండా యూరియా వాడినట్లు గుర్తించారు. దాని ప్రభావం వల్ల వరి కీలకమైన దశలో పంట పూర్తిగా నేల మీద పడిపోయింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్న పొలాల్లో ఎరువుల వాడకం పూర్తిగా ఆపివేయడంతో నేల పటుత్వంతో ఉండి గింజ పాలు పోసుకునే దశలో కంకులు నిలబడి ఉన్నాయి.

పైరు పడిపోతే చాలా నష్టం...

వరి పంట పడిపోవడం వల్ల రైతులకు అపార నష్టం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. పడిపోవడం వల్ల విత్తనాలు పాలుపోసుకోక తాలు గింజలు తయారు కావటం, పూర్తిగా మగ్గక పోవటం, అరగింజలు, విరిగిన గింజలు తయారు కావటం జరుగుతుందని చెబుతున్నారు. వీటి ప్రభావం వల్ల పంట దిగుబడి కూడా పూర్తిగా తగ్గిపోతుంది. ఇంత నష్టం వరి సాగు చేసిన చివరి 20 నుంచి 25 రోజుల్లో జరుగుతుంది. ప్రకృతి పద్ధతిలో సాగు చేసిన వరికి ఈ ప్రమాదం లేదు. కంకులు ఏపుగా నిలబడి ఉండటం వల్ల గింజ పాలు పోసుకుని, ముగ్గే దశలో మేలు జరుగుతుంది. తద్వారా దిగుబడి కూడా పెరుగుతుంది.

తరలి వచ్చిన తెలంగాణ రైతులు..

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న వరి చివరి దశను పరిశీలించేందుకు సోమవారం తెలంగాణ రైతులు జిల్లాకు వచ్చారు. వేజెండ్ల, అత్తోట, కొల్లిపోర మండలంలోని పలు గ్రామాల్లో వరి పైరును సాగు చేశారు. ఒకే చోట రసాయనిక ఎరువులు వాడిన పంటకు,ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటకు మధ్య ఉన్న తేడాను అధికారులు తెలంగాణ రైతులకు చూపించారు.



మాకే ఆశ్చర్యం వేసింది

రాజకుమారి, జిల్లా మేనేజర్, ప్రకృతి వ్యవసాయం



జిల్లాలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి పంట పడిపోకుండా నిలబడి ఉంది. తుఫాను సమయంలో కూడా అంత వరద లోనూ తట్టుకొని వెంటనే తిప్పుకుంది. పంట సంరక్షణ కోసం రైతులు మేము సూచించిన కషాయాలు మాత్రమే వాడారు. ఇప్పుడు వాళ్ళ కళ్ళలో ఆనందం కనిపిసున్నది. రెండు పొలాల మధ్య తేడా స్పష్టంగా కనిపిస్తుంటే మాకే ఆశ్చర్యం వేస్తుంది.

ప్రకృతి పద్ధతే మంచిది

నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయడం రైతులకు అన్ని రకాలుగా మంచిది. మితిమీరిన రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం వల్ల భూమి తో పాటు,పర్యావరణం పాడవుతుంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వరి చక్కగా నిలబడి ఉంది. ఈ సంవత్సరం ఆ రైతులకు మంచి దిగుబడి కూడా వచ్చే అవకాశం ఉంది.

ఏఎన్‌యూలో నేటి నుంచి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

పెదకాకాని, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు దక్షిణ, పశ్చిమ మండల అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల, పురుషుల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వహక కార్యదర్శి, వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పాల్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పాల్ కుమార్ మాట్లాడుతూ ఈ పోటీలు మహిళలకు ఈ నెల 26వ తేదీ నుంచి 28 వరకు, పురుషులకు ఈ నెల 30వ తేదీ నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. 125 విశ్వవిద్యాలయాల నుంచి వెయిట్ లిఫర్టలు ఈ పోటీలలో పాల్గొంటారని వివరించారు. పోటీలను పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రారంభిస్తారని చెప్పారు. ప్రత్యేక ఆహ్వానితులుగా అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మీ, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకటరామయ్య హాజరుకానున్నారు.

సీఎం పర్యటనలో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ జె.వెంకట మురళి



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పర్యటనను జయప్రదం చేయాలని జిల్లా అధికారులకు కలెక్టర్ జె. వెంకటమురళి సూచించారు. జిల్లా అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగే విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి డిసెంబరు 7న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారని తెలిపారు. అధికారిక సమాచారం వచ్చినందున అధికారులంతా అప్రమత్తం కావాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత విద్యాశాఖాధికారులు, మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా సమగ్రప్రణాళికతో అధికారులు పనిచేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు అందుతాయన్నారు. ఆయాశాఖల అధికారులు చేపట్టాల్సిన పనులను వివరించారు. సీఎం పర్యటనకు 10 రోజులు గడువు ఉన్నందున మంచి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

రహదారులకు మహర్దశ!

(5వ పేజీ తరువాయి)

తెనాలి రోడ్డు దుగ్గిరాల వద్ద, చిలకలూరిపేట- పెదనందిపాడు రోడ్డు, వట్టిచెరుకూరు- పాంద్రపాడు, యర్రగుంట్లపాలెం- తుళ్లూరు, కాజ- ఉప్పలపాడు, గుంటూరు- హనుమాన్‌పాలెం, తెనాలి నారా కోడూరు రోడ్లను నిర్మించనున్నారు.

పల్నాడు జిల్లాకు..

పల్నాడు జిల్లాలో తక్షణ మరమ్మతుల కోసం భారీగా నిధులు కేటాయించారు. ఏడు నియోజకవర్గాల్లో జిల్లా ప్రధాన రహదారుల మరమ్మతుల నిమిత్తం 4.86 కోట్లు కేటాయించారు. అత్యధికంగా గుర జాల నియోజకవర్గానికి 1.12 కోట్లు కేటాయించగా, చిలకలూరిపేటకు 93.7 లక్షలు, నరసరావుపేటకు 89.6 లక్షలు, మాచర్లకు 85 కోట్లు చొప్పున కేటాయించారు. వీటితోపాటు అత్యవసర మరమ్మతుల కింద 567.8 కిలో మీటర్ల రహదారుల్లో 82 పనులకు మొత్తం 22.44 కోట్లు కేటాయించారు. వీటిలో 72 మరమ్మతులకుగానూ 3.44 కోట్లు, 371 కి.మీ మేర ప్యాచ్ వర్కుల నిమిత్తం 11.57 కోట్లు, రోడ్డు అంచుల ప్యాచ్ వర్కుల కోసం 94.5 లక్షలు, కంపచెట్ల తొలగింపు కోసం 91.7 లక్షలు, వర్షపు నీటికి దెబ్బతిన్న రోడ్లకు 4.15 కోట్లు కేటాయించారు. ప్రధానంగా రొంపిచర్ల, చిలకలూరిపేట, మాచర్ల, దాచేపల్లి, పెదకూరపాడు, సత్తెన పల్లి, నరసరావుపేట, వినుకొండ, శావల్యాపురం, కారంపూడి, గురజాల, పిడుగురాళ్ల, క్రోసూరులలో ఈ రోడ్లకు మరమ్మతులు చేయించనున్నారు.

బాపట్ల జిల్లాకు రూ. 72.5 కోట్లు

బాపట్ల జిల్లాలో బాపట్ల- రేపల్లె సబ్ డివిజన్లో 217 కి.మీ మేర రాష్ట్ర రహదారులు, 599.6 కి.మీ మేర జిల్లా ప్రధాన రహదారులకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. జిల్లా రహదారుల మరమ్మతులకు సంబంధించి కోటిన్నర రూపాయలతో ఇప్పటికే పనులు పూర్తి చేశారు. కేంద్ర రహదారుల నిధుల కింద రూ. 36.31 కోట్లతో 60.35 కి.మీ మేర రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు రూ. 8.91 కోట్లతో 5.97 కి.మీ మేర రోడ్లు నిర్మిస్తున్నారు. వాటితోపాటు రేపల్లె- నిజాంపట్నం మధ్య రెండు చోట్ల పైప్ కల్వర్టులు, గుంటూరు చీరాల మధ్య మరో కల్వర్టు నిర్మిస్తున్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గంలో కట్రపాడు- శంకరపురం రోడ్డు, రావినూతల రోడ్డు, రేపల్లె- నిజాంపట్నం రోడ్డు, పర్చూరు వంకాయలపాడు- కొడవలివారిపాలెం రోడ్డు, చీరాల- దగ్గుబాడు రోడ్డు, గర్నెపూడి- తిక్కరాజు పాలెం, నూతలపాడు- కారంచేడు, కారంచేడు- ఇంకొల్లు, పందిళ్లపల్లి- కడవకుదురు, వేటపాలెం, సంతరావూరు, జాండ్రపేట- వేటపాలెం, పర్చూరు- ఇంకొల్లు, వేమూరులో వెల్లటూరు- జువ్వలపాలెం, గాజుల్లంక- చింతమోటు, చినపులివర్రు- రావికంపాడు, తెనాలి- వెల్లటూరు, బాపట్లలో ఖాజీపాలెం- బుద్దం మొత్తం 22 పనులకు రూ. 1.15కోట్లు కేటాయించారు. వీటితోపాటు 14 చోట్ల జంగిల్ క్లియరెన్సు పనుల నిమిత్తం 71.28 లక్షలు కేటాయించారు.

భక్తజనంతో పులకించిన పుణ్యక్షేత్రాలు

● అమరావతికి పంచారామాల భక్తులు
● కోటప్పకొండకు వేలాదిగా భక్తులు
● పెదకాకాని శివయ్య సన్నిధిలో శివనామస్మరణ
● సూర్యలంక సముద్ర తీరంలో పుణ్యస్నానాలు



అమరావతి : కృష్ణానదిలో స్నానమాచరిస్తున్న భక్తులు

కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకుని భక్తజనంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు పులకించాయి. ప్రముఖంగా గుంటూరు ఉమ్మడి జిల్లా పరిధిలోని అమరావతి అమరేశ్వరాలయం, కోటప్పకొండపైనున్న త్రికోటేశ్వర స్వామి సన్నిధి, పెదకాకాని మల్లేశ్వర స్వామి ఆలయం, బాపట్ల జిల్లాలోని సూర్యలంక సాగర తీరంలో భక్తులు కార్తీక మాస పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలు ఆధ్యాత్మికశోభను సంతరించుకున్నాయి.



సూర్యలంక తీరంలో పుణ్యస్నానాలను ఆచరిస్తున్న భక్తులు

అమరావతి, నరసరావుపేట, పెదకాకాని, బాపట్ల రూరల్, నవంబరు 25: (ఆంధ్రజ్యోతి) అమరావతిలోని అమరేశ్వర ఆలయానికి ఆదివారం అర్ధరాత్రి నుంచే వివిధ ప్రాంతాల నుంచి పంచారామ పుణ్యక్షేత్రాలు దర్శించే భక్తులు చేరుకున్నారు. సోమవారం తెల్లవారు జామున 3గంటల నుంచి పవిత్ర కృష్ణానదిలో స్నానమాచరించారు. అనంతరం కృష్ణాతీరం, ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలను వెలిగించి పూజలు చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం వరకు భక్తులు ఆలయాన్ని సందర్శిస్తూనే ఉన్నారు. సాయంత్రం స్వర్ణయుగ సేవాట్రస్టు చైర్మన్ దర్శనపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్షదీపోత్సవం జరిగింది. భక్తులకు ఏర్పాట్లను ఈవో పీ. సునీల్‌కుమార్ పర్యవేక్షించారు. డీఎస్పీ ఎం. హనుమంతరావు పలువురు పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

త్రికోటేశ్వర స్వామికి వైభవంగా రుద్రాభిషేకం

ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండలో కార్తీక సోమవారం పురష్కరించుకోని త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. శ్రీమేధా దక్షిణామూర్తి స్వరూప త్రికోటేశ్వరస్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. విశేష పుష్పాలంకరణ సేవ జరిగింది. తెల్లవారు జామునుంచే వేలాదిగా భక్తులు కొండకు తరలివచ్చి స్వామిని దర్శించుకోని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ప్రాంగణంలో.. నందీశ్వరుని విగ్రహం వద్ద పెద్ద ఎత్తున భక్తులు దీపారాధనలు చేశారు. అలయ ఈవో డీ.చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ప్రత్యేక సర్వీసులు కొండకు నడిపింది. పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది.

మల్లేశ్వరాలయంలో బారులు తీరిన భక్తులు

పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానములో వేకువజామునుంచే భక్తులు బారుతు తీరారు. యజ్ఞాల బావి వద్ద కార్తీకమాస స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణములో కార్తీక దీపారాధన పూజలు చేశారు. పలువురు భక్తులు కళ్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవా రుసుములు, ప్రసాదం విక్రయం, అన్నప్రసాద విరాళం, వస్త్రాల బహిరంగ వేలం ద్వారా రూ. 10.10 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవస్థాన ఉపకమిషనరు కేబీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయంలో మల్లేశ్వరస్వామి వారికి లక్షబిల్వార్చన కార్యక్రమం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని ఆలయ ఉప కమిషనరు కోరారు.



పెదకాకాని శివాలయంలో క్యూలో బారులు తీరిన భక్తులు

సూర్యలంక తీరానికి పోటెత్తిన భక్తులు

బాపట్ల మండలం సూర్యలంక తీరం భక్తులతో పోటెత్తింది. అధిక సంఖ్యలో సందర్శకులు, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. తీరం ఒడ్డున మహిళలు కార్తీకదీపాలను వెలిగించి పూజలు చేశారు. అనంతరం సముద్రదేవునికి తాంబూలం సమర్పించి కార్తీకదీపాలను సముద్రనీటిలో వదిలారు. సమీపంలోని శ్రీతారకేశ్వరస్వామి దేవాలయం, బాపట్లలోని శివాలయాలకు భక్తులు తరలి వెళ్ళి ప్రత్యక పూజలను నిర్వహించుకున్నారు. తీరంలో పర్యాటకులు అధిక సంఖ్యలో రావటంతో బాపట్లరూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కనపడని ఖాకీ... వినపడని సైరన్

(5వ పేజీ తరువాయి)

ఈ విధంగా ఇబ్బందికరంగా పరిణమిస్తే మరికొన్ని ప్రాంతాల్లో బైక్ రేసర్లు రెచ్చిపోతున్నారు. విద్యార్థులకు తోడు ఇటీవల కాలంలో ఆకతాయిలు, గంజాయి స్మోకర్లు, చైన్ స్నాచర్లు, పగలంతా వివిధ కర్మాకారాలు, సంస్థలు, షెడ్లలో పనిచేసే వారంతా సాయంత్రానికి స్పీడ్ బైక్ లపై రింగ్ రోడ్ లో ప్రత్యక్షమవుతున్నారు. బైక్ రేస్‌లతో తోటి ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నారు.

అది రింగు రోడ్డు కాదు... రేసింగ్ రోడ్డు

ఒకప్పుడు మదర్ థెరిసా విగ్రహం మొదలు లక్ష్మీపురం బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య కంపెనీ గుజ్జనగుండ్ల విద్యానగర్ సాయిబాబా రోడ్ కొరిటెపాడు నుంచి తిరిగి మదర్ తెరిసా విగ్రహం వరకు ఉన్న రోడ్డు రింగు తరహాలో ఉంటుంది కాబట్టి రింగ్ రోడ్డుగా పిలిచేవారు. ఈ క్రమంలో దశాబ్దాలుగా ఈ రోడ్డుకు రింగ్ రోడ్డు గా నామకరణం జరిగింది. అయితే గడిచిన కొద్ది సంవత్సరాలుగా ఈ రోడ్డును రింగురోడ్డు అనడం మానేసి రేసింగ్ రోడ్డు గా పిలుస్తున్నారు. ఈ రోడ్డులో సాధారణ ప్రయాణికులను సాహసం గానే చెప్పవచ్చు. ముఖ్యంగా సాయంత్రం వేళలో అయితే ఈ రోడ్డు ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. ముఖ్యంగా గుజ్జనగుండ్ల నుండి కొరిటెపాడు సెంటర్ వైపు వెళ్లే ఈ రోడ్డు చూడడానికి సువిశాలంగా కనిపిస్తుంది. కానీ ఈ రోడ్డులో బైక్ రేసర్లు రెచ్చిపోతున్నారు. మితిమీరిన వేగం, భయం గొల్పే శబ్దాలు, గుండె దడ కలిగించే స్నేక్ డ్రైవింగ్, మెలికలు తిరుగుతూ భయాందోళన కలిగించే స్పీడ్ బైక్ విన్యాసాలు ఈ రోడ్డులో నిత్యకృత్యం. ఈ నేపథ్యంలో మహిళలు చిన్నారులు గుండె జబ్బులు ఇతర రోగాలు ఉన్న ప్రయాణికులు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే ప్రాణసంకటం గానే చెప్పవచ్చు.

తాజాగా పది రోజుల వ్యవధిలో జరిగిన రెండు ప్రమాద ఘటనలు భయాందోళన కలిగిస్తున్నాయి. ఈనెల 9న విజయవాడకు చెందిన డెంటల్ విద్యార్థి ఖలీఫా ఇన్నర్ రింగ్‌రోడ్డులోని తన పెద్దమ్మ ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి తన స్పీడ్ బైక్ పై జేకేసీ కళాశాల రోడ్డులో నుంచి రింగ్ రోడ్ లోకి ప్రవేశించాడు. 120 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో కొరిటెపాడు వైపు దూసుకు వస్తూ నవభారత్‌నగర్ సెంటర్లో రోడ్డు క్రాస్ చేసేందుకు సిద్ధంగా ఉన్న బీటెక్ విద్యార్థుల యాక్టివా వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో యాక్టివా వాహనం నడుపుతున్న బీటెక్ విద్యార్థి పవన్‌కు తీవ్ర గాయాలు కాగా వెనుక కూర్చున్న కౌశిక్ కూడా గాయపడ్డాడు. ఇదే ఘటనలో ఓ గర్భిణీ మహిళతో పాటు ఆమెతో పాటు ఉన్న ఓ చిన్నారి బాలిక కూడా గాయపడింది. పవన్‌కు తొంటి విరగడంతో పాటు నడుముకు బలమైన గాయాలు కావడంతో వైద్యులు ఎనిమిది గంటలపాటు శ్రమించి ఆపరేషన్ పూర్తి చేయగలిగారు. ఇంతటి తీవ్ర ప్రమాదం జరిగినా ట్రాఫిక్ పోలీసులు గానీ, నగర పాలక సంస్థ అధికారులు గానీ స్పందించకపోవడంతో సరిగ్గా రెండు వారాలకు అందులోనూ శనివారం అర్ధరాత్రి అంటే ఈ నెల 23న రాత్రి అదే ప్రదేశంలో, వికాస్‌నగర్ ఒకటోలైనుకు చెందిన దాసరి రమేష్ (65) నవభారత్‌నగర్ వద్ద రోడ్డు దాటుతుండగా అదే సమయంలో గుజ్జనగుండ్ల వైపు నుంచి కొరిటెపాడు వైపు స్పీడ్ బైక్‌పై మితిమీరిన వేగంతో వెళుతున్న బెలగొబ్బుల మల్లేష్ (20) అనే యువకుడు తన ద్విచక్రవాహనంతో ఢీ కొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు.

ఈనెల 17న ఆదివారం రాత్రి విద్యానగర్ ఒకటో లైన్ సమీపంలోని మెయిన్ రోడ్డుపై ఇదే తరహాలో ఓ రేసర్ మితిమీరిన వేగంతో వచ్చి డివైడర్ దాటేందుకు ప్రయత్నిస్తున్న పాదచారిని బలంగా ఢీకొట్టాడు. ప్రమాదాన్ని నియంత్రించేందుకు రేసర్ ఓ పెద్ద విన్యాసమే చేశాడు. తన వాహనం ముందు చక్రాన్ని గాలిలోకి లేపి స్థానికులను భయాందోళనకు గురిచేశాడు. ఈ ఘటనలో పాదాచారికి కూడా బలమైన గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు రేసర్‌ను చుట్టుముట్టారు. అతడిని విచారించగా ఆ యువకుడికి డ్రైవింగ్ లైసెన్స్ లేదని, వాహనానికి సంబంధించిన పత్రాలు కూడా లేవని తెలుసుకున్నారు. అంతేగాక ఆ యువకుడు కూలి పనులు చేసుకుంటానని చెప్పడంతో స్థానికులకు అనుమానం వచ్చింది. ఈ వాహనాన్ని ఎక్కడైనా అపహరించి ఉంటాడని, చైన్ స్నాచింగ్ లకు పాల్పడుతూ ఉంటాడని అనుమానించారు. ఆ సమయంలో ఆ యువకుడు గంజాయి సేవించి ఉన్నట్లు ఆయన ప్రవర్తన బట్టి ప్రజలు అర్థం చేసుకున్నారు. కొద్ది సమయానికి మరో నలుగురు యువకులు అక్కడికి చేరుకొని స్థానికలను భయభ్రాంతులకు గురి చేశారు. అప్పటి వరకు భయంతో ఉన్న రేసర్ వారు రాగేనే రెచ్చిపోయాడు. తన చేతికి ఉన్న కడియాన్ని తీసి స్థానికులపై దాడికి యత్నించాడు. అప్పటికే ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇచ్చినా వారు సకాలంలో రాలేదు. స్థానికులు ఆయువకుడి వాహనం తాళం చెవి తీసుకున్నప్పటికీ, అతని కోసం వచ్చిన యువకులతో కలిసి వాహనాన్ని నెట్టుకుంటూ వెళ్లి కొంచం దూరం వెళ్ళాక అక్కడ స్టార్ట్ చేసుకొని వెళ్లిపోయారు. ఈ విధంగా రింగ్ రోడ్డులో ప్రతిరోజు ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ట్రాఫిక్ పోలీసులు గాని కనీసం లా అండ్ ఆర్డర్ పోలీసులు గాని ఈ రోడ్డుపై దృష్టి సారించక పోవడం ఆందోళన కలిగించే విషయంగా చెప్పవచ్చు.

ఆ రోడ్లలో వరుస ప్రమాదాలు మరణాలతో భీతుల్లుతున్న ప్రజలు

ముఖ్యంగా నగరంలోని జెకేసి కళాశాల రోడ్డు, అదేవిధంగా గుజ్జనగుండ్ల నుంచి కొరిటెపాడు వెళ్లే రోడ్లలో కొద్ది సంవత్సరాలుగా జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాలు, ప్రమాద మరణాలతో ప్రజలు భీతిల్లి పోతున్నారు. ఆర్టీవో కార్యాలయం నుంచి జెకెసి కళాశాల డీమార్ట్ వరకు ఉన్న రోడ్డులో సెంటర్ డివైడర్ లేకపోవడం రోడ్డును విస్తరించడం, ఎక్కడా స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, దీనికి తోడు విజయవాడ, అమరావతి వైపు నుంచి వచ్చే వాహనాలు అదే వేగంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తుండంతో ఈ రోడ్డులో వాహనాల వేగం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో గడచిన కొద్ది సంవత్సరాలుగా ఈ రోడ్డులో జరిగిన ప్రమాదాల కారణంగా అనేకమంది మృత్యువాత పడ్డారు. ముఖ్యంగా సాధారణ వాహన రాకపోకల రద్దీతోపాటు స్పీడ్ బైక్ ల విన్యాసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గడిచిన నాలుగైదేళ్లలో సుమారు 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంత జరుగుతున్నా అటు నగరపాలక సంస్థ అధికారులు కానీ, ట్రాఫిక్ పోలీసులు గాని స్పందించడం లేదు. కనీసం సెంటర్ డివైడర్ ఇంత వరకు నిర్మించలేకపోయారు. మరణాలే కాదు రోజు వారి ప్రమాదాలు కూడా భయాందోళన కలిగిస్తున్నాయి. ఈ రోడ్డులో కనీసం ఒక్కసారి కూడా ట్రాఫిక్ కానిస్టేబుల్ కానీ, ఇతర పోలీసులు గాని కనిపించిన దాఖలాలు లేవు. ప్రమాదం జరిగినప్పుడు అది కూడా క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన తర్వాత ఎప్పుడో కేసు రాసుకోవడానికి మాత్రం పోలీసులు వచ్చి పోతుంటారు.

20 మంది ట్రాఫిక్ పోలీసులా...?

అసలే సిబ్బంది కొరత మరోవైపు నగరంలో ట్రాఫిక్ సమస్యలు జఠిలమవుతున్న తరుణంలో అదనపు సిబ్బందిని కేటాయించకపోగా ఉన్న సిబ్బందిలో 80 శాతం మందిని ఇతర డ్యూటీలకు కేటాయించారు. దీంతో నగరంలో ట్రాఫిక్ విధులకు 40 మంది మాత్రమే మిగులుతారు. అందులో 20 మంది ఒక షిఫ్ట్ లో. మరో 20 మంది రెండో షిఫ్ట్‌లో విధులు నిర్వహిస్తుంటారు. అంటే నగరం మొత్తం మీద ఏ సమయంలోనైనా ఉదయం నుంచి సాయంత్రం లోపు 20 మంది సిబ్బంది మాత్రమే విధుల్లో ఉంటారు. ఇంతటి పెద్ద నగరంలో కేవలం 20 మంది ట్రాఫిక్ పోలీసులు మాత్రమే రోడ్లపై ఉంటుంటే ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ఎలా సాధ్యమవుతుందనేది ఆలోచించాలి. ఏదైనా ప్రమాదం గానీ లేదంటే వీఐపీ గాని వస్తే ఆ 20 మందిలో కొంతమంది అటువైపు వెళ్తారు. దీన్ని బట్టి నగరంలో ఎక్కడా ట్రాఫిక్ పోలీసు కంటికి కనిపించరు. ఇప్పటికైనా ట్రాఫిక్ విభాగం నుంచి అటాచ్మెంట్ పై ఇతర విభాగాలకు వెళ్ళిన వారందరిని వెనక్కి రప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతే గాక అదనపు సిబ్బందిని కూడా నియమించాల్సి ఉంది.

రైతుసేవాకేంద్రాల్లో నమోదు చేసుకోవాలి

దుగ్గిరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులు, సమీప రైతుసేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్‌లు జరుపుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.శిరీష సోమవారం తెలిపారు. 2024లో ఈపంట నమోదు చేయించుకుని ఈకేవైసీ పూర్తిచేసుకున్న రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోవచ్చునన్నారు. గ్రేడ్ -ఏ రకం ధాన్యం క్వింటాల్ రూ.2320, 75 కిలోలు రూ.1740కు గ్రేడ్-బీ రకం ధాన్యం క్వింటాల్ రూ.2300, 75కిలోలు బస్తా రూ. 1720కు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసే మిల్లర్లు గోతాములు అందిస్తారని అన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో చంద్రికకు బంగారు పతకం



సౌత్ ఇండియా పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని సాధించిన బొల్లినేని చంద్రిక

మంగళగిరి సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మంగళగిరికి చెందిన బొల్లినేని చంద్రిక ప్రతిభను చాటి బంగారుపతకాన్ని సాధించింది. సదరన్ రైల్వే సేలం డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు తమిళనాడులోని సేలంలో ఈ ఛాంపియన్ షిప్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో చంద్రిక సత్తాను చాటి బంగారు పతకాన్ని సాధించింది. ఆమె స్క్వాడ్‌లో 250 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 110కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 200 కిలోలు కలిపి మొత్తం 560 కిలోల బరువును ఎత్తడం ద్వారా స్ట్రాంగెస్ట్ ఉమెన్ ఇన్ సౌత్ ఇండియాగా నిలిచింది. తద్వారా చంద్రిక బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా చంద్రికకు పలువురు స్థానికులు, పురప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

కొనసాగుతున్న ఏసీసీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏసీసీ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు సోమవారంతో 29వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పట్టణ సీఐటీయూ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ కోర్టు తీర్పులు కార్మికులకు అనుకూలంగా ఇచ్చినా యాజమాన్యం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు యాజమాన్యానికి వారధిగా నిలిచి మంత్రి లోకేశ్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేత స్టీవెన్, ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ, బీ యెహోషువ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సృజనాత్మక బోధన అవసరం : ఎంఈవో

కాకుమాను, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సృజనాత్మక బోధన చేయాలని ఎంఈవో కేఎఫ్ కెన్నడీ అన్నారు. మండలపరిధిలోని కొండపాటూరు ఎంపీయూపీ పాఠశాలను సోమవారం తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హిందీ ఉపాధ్యాయిని ప్రమీలాదేవి 'ఖిలోనే వాలా' పాఠ్యాంశాన్ని బొమ్మల రూపంలో విద్యార్థులకు చేస్తున్న బోధనపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శీలం అంకారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి ర్యాలీని జయప్రదం చేయాలి

తాడేపల్లి టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు రేట్లు ఇవ్వాలని, చట్టబద్ధత కల్పించాలని, రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, విద్యుత్ సంస్కరణలు నిలుపుదల చేయాలని, విద్యుత్ రంగం ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని తదితర డిమాండ్లతో నవంబరు 26న గుంటూరు శంకర్‌విలాస్ సెంటర్ నుంచి అఖిలపక్ష రైతు సంఘాలు, కార్మిక సంఘాల సమైక్య ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని జొన్నా శివశంకర్ అన్నారు. తాడేపల్లిలో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన రైతు లకు విజ్ఞప్తి చేశారు.

మహాసభను జయప్రదం చేయండి

తాడికొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ గుంటూరులో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ తెలిపారు. సోమవారం తాడికొండ బస్టాండ్ సెంటర్లో జనసమీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



నవచంద్ర ప్రసాదు(ఫైల్)

వట్టిచెరుకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గారపాడు గ్రామానికి చెందిన కౌలు రైతు నవచంద్ర ప్రసాదు (56) ఈనెల 3వ తేదీ ఆత్మహత్యకు పాల్పడి ప్రాణాపాయ స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు సీఐ రమానాయక్, ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు.

దేగల ప్రభాకర్‌కు జనసేన నాయకుల అభినందనలు



దేగలకు అభినందనలు తెలియజేస్తున్న జనసేన నాయకులు

మేడికొండూరు నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా దేగల ప్రభాకర్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఏపూరి పూర్ణ, తాడికొండ నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ కందుల సైదయ్య దేగలకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అగ్గి రాజుకుంటే బుగ్గే

- కలగానే మిగిలిన అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు
- ఏటా సంభవిస్తున్న ప్రమాదాలు
- లక్షల రూపాయల్లో ఆస్తి నష్టం
- చొరవ చూపని అధికారులు, ప్రజాప్రతినిధులు



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

తాడికొండ నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు, తాడికొండ, ఫిరంగిపురం మండలాల్లో అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు కలగానే మిగిలింది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఆయా మండలాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుళ్లూరు, తాడికొండ మండలంలోని గ్రామాల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే గుంటూరు నుంచి, మంగళగిరి, అమరావతి నుంచి ఫైర్ ఇంజన్ రావాల్సి ఉంటుంది. 30 నిమిషాల నుంచి 45 నిమిషాల సమయం పడుతుంది. అదే రాజధాని ప్రాంతమైన తుళ్లూరు మండలంలోని గ్రామాల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే మంగళగిరి, అమరావతి, గుంటూరు నుంచి ఫైర్ ఇంజన్ రావాల్సిన పరిస్థితి. గుంటూరు నుంచి గంట, మంగళగిరి నుంచి 30 నిమిషాలు, అమరావతి నుంచి 45 నిమిషాల సమయం పడుతుంది. అదేవిధంగా ఫిరంగిపురం మండలంలోని గ్రామాల్లో అగ్ని ప్రమాదం జరిగితే సత్తెనపల్లి, నరసరావుపేటల నుంచి ఫైరింజన్ రావాల్సి ఉంది. సత్తెనపల్లి 24 కిలోమీటర్లు, నరసరావుపేట 25 కిలోమీటర్ల దూరం ఉన్నది. ఎక్కడ నుంచి రావాలన్నా సుమారు 30 నుంచి 45 నిమిషాల సమయం పడుతుంది. ఇవి వచ్చే లోపు ఆస్తి, ప్రాణ నష్టాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. నియోజకవర్గంలోని తాడికొండ, ఫిరంగిపురం, తుళ్లూరు మండలాల్లో సుమారు 50కి పైగా గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో దాబా, పెంకుటిళ్లు, రేకుల ఇళ్లు, పూరిళ్లు ఉన్నాయి. ప్రతి ఏటా అగ్ని ప్రమాదాలు సంభవిస్తునే ఉన్నాయి. వేసవి కాలంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. వీటిని నియంత్రించేందుకు సమీపంలో ఉన్న నీటిని ప్రజలు ఉపయోగిస్తుంటారు. అయితే ప్రమాదం పెద్దగా ఉంటే సర్వం బూడిదవుతోంది. ఇలా ఏటా లక్షల రూపాయల్లో ఆస్తి నష్టం జరుగుతుంది. రైతులు, పూరిళ్లు కలిగిన వారు ఎక్కువ గా నష్టపోవాల్సిన పరిస్థితి.

రైతులు నష్టపోతున్నారు

● చింతల భాస్కరరావు, సీపీఎం మండల కార్యదర్శి



ఏటా జరుగుతున్న అగ్ని ప్రమాదాల్లో ఎక్కువగా వరి కుప్పలు కాలిపోతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి ఫైరింజన్ వచ్చే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. పరిహారం కూడా రావటం లేదు. తాడికొండ మండలంలో అగ్నిమాపక కేంద్రం ఆవశ్యకత చాలా ఉంది. ప్రతి సంవత్సరం అగ్ని ప్రమాదాలు జరిగి రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరుగుతోంది. ప్రభుత్వం స్పందించి అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

రైతులకు న్యాయం చేయాలి

- రైల్వే లైన్, ఇన్నర్ రింగ్‌రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు
- కలెక్టర్‌కు రైతులతో కలిసి వినతిపత్రం ఇచ్చిన ఎమ్మెల్యే శ్రావణ్
- ప్రభుత్వ ప్రాజెక్టులకు రైతులు వ్యతిరేకం కాదు
- స్పష్టమైన పరిహారం ప్రకటించాలి



కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, రైతులు

తాడికొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన నూతన రైల్వే లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణాలకు భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. రైల్వేలైన్, ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న తాడికొండ, మోతడక గ్రామాల రైతులు ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌కు సోమవారం గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ కలెక్టర్ నాగలక్ష్మీని రైతులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైల్వే లైన్, ఇన్నర్‌రింగ్‌రోడ్డు, కొండవీటి వాగు అభివృద్ధి, అమరావతి - అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవేలో ఎక్కువ శాతం తాడికొండ గ్రామ రైతులు భూములు కోల్పోతున్నారని తెలిపారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వివిధ ప్రాజెక్టుల్లో భూములు కోల్పోతున్న రైతుల వివరాలు వెల్లడించి, బ్లూప్రింట్‌ను రైతులకు అందజేసి, ఇవ్వాల్సిన పరిహారాన్ని ముందుగానే ప్రకటించాలని తెలిపారు. రైతుల నుంచి ఇష్టపూర్వకంగానే భూములు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని తాడికొండ, మోతడక, కంతేరు, పెద్దపరిమి, వడ్డమాను రైతుల భూములు వివిధ ప్రాజెక్టుల్లో కోల్పోతున్నారన్నారు. రైతుల అంగీకారం తెలియజేసిన తరువాత మాత్రమే పొలాల్లోకి రావాలని రైతులు ఖరాఖండిగా చెప్పారు. తాడికొండలోని అధిక శాతం పొలాలు వివిధ ప్రాజెక్టుల కింద రైతులు కోల్పోతున్నారని తెలిపారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ రైల్వేలైన్ ప్రాజెక్టు మాత్రం అమల్లో ఉన్నదని, మిగిలిన ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం నుంచి పూర్తి సమాచారం రాలేదు కాబట్టి మిగిలిన ప్రాజెక్టుల వివరాలు తెలియాల్సి ఉందన్నారు. రైతులకు న్యాయం జరిగేలా చేస్తామన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ భూసమీకరణకు వ్యతిరేకంగా ఉన్నామని, రాజధాని నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ ఏవిధంగా చేశారో ప్రభుత్వం అదేవిధంగా ల్యాండ్ పూలింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. తాడికొండ రైతులకు కంటిమీద కునుకు ఉండట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు అర్థం చేసుకొని న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు రైతులు వ్యతిరేకంగా కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎద్దూరి హనుమంతరావు, టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గుంటుపల్లి మధుసూదనరావు, యడ్లపల్లి సాంబశివరావు, తాడికొండ, మోతడక రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జిల్లాస్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో డీవైఈవో వెంకటేశ్వరరావు తదితరులు

గుంటూరు(విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాత బస్టాండ్ వద్ద ఉన్న పరీక్షాభవన్ నందు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ వారి సౌజన్యంతో జిల్లా స్థాయి పర్యావరణ సైన్స్ కాంగ్రెస్-2024ను విద్యాశాఖ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీవైఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ, నార సంచులను ఉపయోగించాలని సూచించారు. ఈ సందర్భంగా 'చెత్త నుంచి సంపద తయారు చేయుట' అనే అంశంపై ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. పర్యావరణ కాలుష్యం, దానిని తగ్గించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశంపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 94 పాఠశాలల నుంచి 225 మంది పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు రమణయ్య, జ్యోతి కిరణ్, నాగేంద్రమ్మ, డీసీఈబీ సెక్రటరీ తిరుమలేష్, ఉర్దూ పాఠశాలల డీఐ ఖాసిం, హెచ్‌ఎంలు, పాల్గొన్నారు

● పోటీల్లో డ్రాయింగ్‌లో మేడికొండూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. ద్వితీయ బహుమతిలు కాకుమాను జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల (ఎగ్జిబిషన్) గెలుచుకున్నారు. ఇంకా తృతీయ బహుమతుల్ని దుగ్గిరాల జడ్పీ ఉన్నత పాఠశాల (ఎగ్జిబి షన్) విద్యార్థులు గెలుచుకున్నారని జిల్లా సైన్స్ అధికారి గౌసుల్‌మీరా వెల్లడించారు.

పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

ఫిరంగిపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ జే ప్రసాదరావు తెలిపారు. పొలం సమస్యలు నాలుగు, పొలం కొలతల కోసం ఒక అర్జీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏపీవో నాగేశ్వరరావు, ఏఈలు, హౌసింగ్ ఏఈ, ఆర్‌ఐ రెహ్మాన్ తదితర మండల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి సభ్యత్వ నమోదు



తాడికొండలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టిన టీడీపీ శ్రేణులు

తాడికొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా ఉంటుందని.. పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు ఎంతో అవశ్యకమని ఆపార్టీ రాష్ట వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ బండ్ల కోటేశ్వరరావు అన్నారు. సోమవారం తాడికొండలోని రావిచెట్టు సెంటర్ వద్ద టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరూ ఓటు కార్డు తీసుకొని వచ్చి పార్టీ సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవచ్చునని అన్నారు. పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. కార్యక్ర మంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

తుళ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దొండపాడు ప్రాంతంలో ఇసుకను అక్రమంగా లోడు చేసుకున్న లారీని తుళ్లూరు పోలీసులు సోమవారం సీజ్ చేశారు. లారీతో పాటు లోడింగ్‌కి ఉపయోగించిన జేసీబీని కూడా స్వాధీనం చేసుకుంటున్నట్టు తుళ్లూరు సీఐ గంగా వెంటేశ్వర్లు తెలిపారు.

మంచికలపూడిలో 510 మందికి వైద్యపరీక్షలు



శిబిరంలో వైద్యపరీక్షలకు వచ్చిన వారికి మందులను అందిస్తున్న ఎంపీపీ జబీన్, సర్పంచ్

దుగ్గిరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ఉచిత వైద్యపరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేసి, ఈసీజీ, ఎకో వంటి ఖరీదైన పరీక్షలు కూడా చేయడం అభినందనీయమని ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. మంచికలపూడిలో జిల్లా అంధత్వ నివారణాసంస్థ, జీజీహెచ్, ప్రియాంక మహిళా మండలి, లెమెన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ గుంటూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ ప్రారంభించారు. జబీన్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో వైద్యపరీక్ష శిబిరాలు ఏర్పాటు చేస్తున్న ప్పటికి వాటిని ఎక్కువ మంది సద్వినియోగం చేసుకోలేక పోతున్నారని, సాధారణ పరీక్షలతో పాటు ఖరీదైన పరీక్షలు కూడా ఉచితంగా చేసేందుకు ముందుకు వచ్చిన సేవా సంస్థలను అభినందించారు. గుంటూరు ఎల్‌ఈఎఫ్ అధ్యక్షుడు కె.పీటర్‌పాల్ మాట్లాడుతూ వైద్యులు సూచించిన పరీక్షలు చేయించుకోవడంతో పాటు, మందులను క్రమం తప్పకుండా తీసుకుంటేనే జబ్బునయమవుతుందని అన్నారు. నిర్వాహకుడు పెరవలి శివాజీ మాట్లాడుతూ వైద్యశిబిరానికి విశేష స్పందన లభించడంతో ప్రజలకు, స్వచ్ఛందంగా పాల్గొన్న వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గుండెజబ్బులు, కంటి, చెవి, ముక్కు, గొంతు, వైద్యనిపుణులు చర్మ వ్యాధులకు సంబంధించి పలువురు వైద్యపరీక్షలు మొత్తం 510 మందికి నిర్వహించారు. అనంతరం అవసరమైన మందులు పంపిణీ చేశారు. వైఎంసీఏ యూత్ ప్రతినిధులు పెరవలి శివాజీ, మంచికలపూడి వెంకటేశ్వరరావు, అద్దేపల్లి జయరాజ్, ఏసుపాగ నాగయ్య, విజయవాడ సెంటినీ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ విజయబాబు, సర్పంచ్ యార్లగడ్డ చంద్రదుర్గాభవాని, ఎంపీటీసీ మరీదు రాము, చిన్నా, కోటేశ్వరరావు, ఆశాకార్యకర్తలు, పీహెచ్‌సీ వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం



ఫిరంగిపురంలో లింగ వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న తహసీల్దార్ జే ప్రసాదరావు, తదితరులు

తుళ్లూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం నిర్వహిస్తున్నట్టు వెలుగు ఏపీఎం చిన వీరయ్య తెలిపారు. సోమవారం తుళ్లూరు వెలుగు కార్యాలయంలో మహిళలు హింసను ఏ విధంగా ఎదుర్కోవాలి, రక్షణ పొందాలి అనే దాని మీద అవగాహనా కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మహిళలతో అనుచితంగా వ్యవహరిస్తే కఠిన శిక్షలు ఖాయమన్నారు. ఈ నెల 25 నుంచి డిసెంబరు 23 వరకు వివిధ రకాలుగా మహిళలపై హింసకు వ్యతిరేకంగా అందరూ కలసికట్టుగా ఒకే స్వరం వినిపించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు మాధవి, కుమారి, సుందర్రావు, రాజారావు, మండల సమాఖ్య అకౌంటెండ్ కీర్తి, గ్రామ సంఘాల వీవోఏలు పాల్గొన్నారు.

● తాడికొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని తహసీల్దార్ కే నాసరయ్య తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో బాల్య వివాహాల అనర్థాలపై ర్యాలీ నిర్వహించారు. మండల పరిధిలోని రావెలలో క్రాఫ్ ఆధ్వర్యంలో షైక్ ప్రచారాన్ని సర్పంచ్ రావెల శైలజ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సమతవాణి, ఎంఈవో ఇందిరా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఏపీఎం, క్రాఫ్ కో-ఆర్డినేటర్ పాల్గొన్నారు.

● ఫిరంగిపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల అబల కాదు.. సబల అని ఎంపీపీ షేక్ సహేల నర్గిస్ అన్నారు. ఫిరంగిపురంలోని మండల పరిషత్ సమావేశపు హాల్లో లింగ వివక్షపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ర్యాలీ, ప్రతిజ్ఞ చేసి మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ, తహసీల్దార్ జే ప్రసాదరావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ, సూపర్‌వైజర్, సీసీలు, యానిమేటర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● మేడికొండూరు నవంబరు 25(ఆంధ్రజ్యోతి): లింగ ఆధారిత హింస, వివక్షకు వ్యతిరేకంగా మేడికొండూరులో అధికారులు, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం విజయభారతి, ఈవోపీఆర్‌డీ, ఏపీవో, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గిరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లింగవివక్ష తగదని స్త్రీ,పురుషులు అందరూ సమానమేనని నినాదాలు చేస్తూ దుగ్గిరాలలో ర్యాలీ నిర్వహించారు. పోస్టాఫీసు సమీపంలో తహసీల్దార్ ఐ.సునీత, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీ ఎం సురేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీవోఏలు, ఏపీఎం మధుబాల, తదితర అధికారులు ప్రతిజ్ఞ చేశారు.

ఆరుమాసాల్లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం

● ఏపీఎంఎస్‌ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు



వంద పడకల ఆస్పత్రి మ్యాప్‌ను పరిశీలిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలలో ఒకటైన వంద పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని ఆచరణ సాధ్యం చేయడం ద్వారా మంత్రి నారా లోకేశ్ తన చిత్తశుద్ధిని చాటుకున్నారని ఏపీఎంఎస్‌ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. రూ.52.8 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆస్పత్రి పునర్నిర్మాణ స్థలాన్ని ఆయన సోమవారం తమ కార్యాలయపు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలోనే మంత్రి నారా లోకేశ్ ఈ ఆస్పత్రి ప్రాంగణాన్ని పరిశీలించి శంకుస్థాపన తేదీని ప్రకటిస్తారని చెప్పారు. శంకుస్థాపన జరిగిన ఆరు మాసాలలోపే నిర్మాణ పనులను పూర్తిచేసే విధంగా తమ కార్యాలయం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఆస్పత్రిని నాణ్యతా ప్రమాణాలతో అత్యంత అధునాతనంగా నిర్మించేలా తాను ప్రత్యేక శ్రద్ధ వహిస్తానన్నారు. మంగళగిరిలో నిర్మించనున్న ఆ వంద పడకల ఆస్పత్రి రాష్ట్రంలోనే ఓ రోల్‌మోడల్‌గా నిలువబోతుందన్నారు. ప్రతీ పేదవానికి కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యసాధనలో భాగంగానే లోకేశ్ ఈ ఆస్పత్రి నిర్మాణాన్ని చేపట్టారన్నారు. మూడెకరాలకు పైగా ఉన్న ఈ ఆస్పత్రి భూమిని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు వైసీపీ నేతలు కొంతమేర అన్యాక్రాంతం చేశారని ఆయన ఆరోపించారు. మంగళగిరికి త్వరలోనే మంచి రోజులు రాబోతున్నాయని.. వేలకోట్ల రూపాయల నిధులతో మంగళగిరి అభివృద్ధి శరవేగంగా జరుగబోతుందని చిల్లపల్లి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు దామర్ల రాజు, జనసేన నాయకులు చిట్టెం అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

పని వత్తిడి తగ్గించండి : ఇంజనీరింగ్ అసిస్టెంట్లు



ఎంపీడీవో శివపార్వతికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ఆఫ్ సెక్రటరియేట్ ఇంజనీర్స్ మండల అధ్యక్షుడు సీహెచ్ కాంప్రసాద్ తదితరులు

ప్రత్తిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంట్ పనులతో పాటు వివిధ రకాల నాన్ టెక్నికల్ వర్క్సును మాకు అప్పగించడం వల్ల పని వత్తిడి పెరిగి పోయిందని, ఈ పని వత్తిడి నుంచి తమకు విముక్తి కలిగించాలంటూ ప్రత్తిపాడు మండలపరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్తిపాడు ఎంపీడీవో శివపార్వతి, తహసీల్దార్ కరుణాకర్‌లకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం తమపై పల్లెపండుగ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సీసీ రోడ్లు, డ్రెయిన్స్, అంగన్వాడీ సౌకర్యాల కల్పన పనులు, హౌసింగ్ నిర్మాణ పనులు టార్గెట్స్‌తో ఉక్కిరి బిక్కిరి అవుతున్నామని, ఈ క్రమంలోనే హౌసింగ్ జియో ట్యాగ్, ఎన్‌పీసీఐ లింకింగ్ సర్వేలు చేస్తూనే బీఎల్‌వో విధులు కూడా నిర్వహిస్తున్నామన్నారు. దీంతో తమకు సెలవు దినం అనేదే లేకుండా పోయిందంటూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తమకు పని భారాన్ని తగ్గించాలంటూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో బాగంగా మండల స్థాయి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియేట్ ఇంజనీర్స్ ప్రత్తిపాడు మండల అధ్యక్షుడు సీహె చ్ కాంప్రసాద్, జనరల్ సెక్రటరీ రామచంద్రారావు, నిఖిల్ తేజ్, లావణ్య, తేజశ్విని, ఆనంద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీపీఎల్ కుళాయి కనెక్షన్‌లను తక్షణమే ఇవ్వాలి

మంగళగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మంగళగిరి నగరంలోని ప్రజలకు సాధారణ కుళాయి కనెక్షన్‌లతోపాటు బీపీఎల్ కనెక్షన్లను కూడ తక్షణమే మంజూరు చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు ఇంటింటికి కుళాయి కనెక్షన్‌లను ఇవ్వాల్సిన బాధ్యత కూటమి నేతలపై ఉందని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం తమ పార్టీ ప్రతినిధులతో కలిసి ఆయన ఎంటీఎంసీ కార్యాలయానికి వెళ్లి కమిషనరు అలీంబాషాకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశియ్య, అన్నవరపు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కీలక పదవుల రాకతో నేచర్ వాకర్స్ హర్షం



పదవులు పొందిన అబ్బయ్య, జానకీదేవి, చిల్లపల్లి దంపతులను సత్కరిస్తున్న నేచర్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మంగళగిరికి రాష్ట్రస్థాయిలో మూడు కీలకమైన పదవులు లభించడంపై స్థానిక నేచర్ వాకర్స్ అసోసియేషన్ హర్షం వెలిబుచ్చింది. ఈ మేరకు సోమవారం పదవులు పొందిన ముగ్గురిని అభినందిస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర పద్మశాలీ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నందం అబ్బయ్య, టీటీడీపాలక మండలి సభ్యురాలిగా నియమితులైన తమ్మిశెట్టి జానకీదేవి, ఏపీఎంఎస్‌ఐడీసీ చైర్మన్‌గా నియమితులైన చిల్లపల్లి శ్రీనివాసరావు దంపతులను అసోసియేషన్ ప్రతినిధులు ఘననంగా సత్కరించారు.

కనుల పండువగా కోటి దీపోత్సవం



కోటి దీపోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన దేవతా మూర్తులు

మేడికొండూరు నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం, పేరేచర్లలో కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీకమాస సందర్భంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీమహా త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కోటి దీపోత్సవ కార్యక్రమం సోమవారం రాత్రి కనుల పండువగా సాగింది. పేరేచర్ల సమీప గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తుల హాజరై భక్తి శ్రద్ధలతో దీపోత్సవంలో పాల్గొన్నారు. ఉపన్యాసకులుగా శృంగేరి జగద్గురు ఆస్థాన కమిటీ సభ్యులు డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం చేపట్టారు. సుమారు 4గంటల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు అన్నదానం జరిగింది. ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఈ దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

● కాకుమాను, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శైవక్షేత్రాల్లో సోమవారం చివరి కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయం వద్ద దీపోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

రాజ్యంగంపై విద్యార్థులకు పోటీ పరీక్షలు

పొన్నూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యంగం దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు రాజ్యంగం, ప్రాథమిక హక్కులు అనే అంశంపై పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 26వ తేదీన రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా జైభీమ్ సమూహ ఆధ్వ ర్యంలో ఈ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో యడ్ల వందనం, ఎద్దు శ్యామూల్ రాజు, మద్దుమాల సుభాష్, తురిమల్లా నితీష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు పది అర్జీలు

తెనాలి అర్బన్, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమ వారం నిర్వహించిన ప్రజా సమస్యల పరి ష్కార వేదికకు పది అర్జీలు అందాయి. రెవెన్యూ 6, పంచాయతీ, హెల్త్, పోలీసు, హౌసింగ్ శాఖలకు ఒక్కో దరఖాస్తు అంది నట్లు సంబంధిత అధికారులకు వాటిని పంపి పరిష్కరించనున్నట్లు కార్యాలయ అధి కారులు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయానికి ఏడు...

తెనాలి రూరల్, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): మండల తహసీల్దార్ కార్యాల యంలో సోమవారం నిర్వహించిన ప్రజాస మస్యల పరిష్కారవేదికకు 7 అర్జీలు అంది నట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు. అందులో 6 సర్వేకి రాగా మరొకటి వీఆర్వోను నియమించాలని అందినట్లు వెల్లడించారు.

పురపాలక సంఘానికి రెండు ..

తెనాలి, మారీసుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ మేనేజర్ ఆర్ చండి దేవసేన అధికారులతో కలసి నిర్వ హించారు. ఇంజనీరింగ్ శాఖకు ఒక అర్జీ, శానిటేషన్ సెక్షన్‌కి ఒక అర్జీ వచ్చిందని ఈ సమస్యపై సంబంధిత శాఖల అధికారులతో కలసి చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు.

అధికారులు హాజరుకావాలి: తహసీల్దార్

కొల్లిపర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అధికారు లందరూ తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వ హించిన ప్రజా సమస్యల పరిష్కార వేది కకు మూడు దరఖాస్తులు రావటంతో వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గ్రీవెన్స్‌కు ఎంపీడీవో విజయ లక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబి రెడ్డి, ఈవోపీఆర్‌డీ భార్గవ్, ఎంఈవో సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి నాగమల్లేశ్వరితో హెచ్‌ఎం, పీఈటీ

జాతీయ వాలీబాల్ పోటీలకు నాగమల్లేశ్వరి ఎంపిక

చేబ్రోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు వేజెండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని కోట్ల నాగ మల్లేశ్వరి ఎంపికైంది. ఇటీవల విజయనగరం జిల్లా భోగాపురంలో జరిగిన అండర్ 14 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి వాలీ బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కోట్ల నాగమల్లేశ్వరి ప్రతిభ చూపి రాష్ట్రజట్టుకు ఎంపికైంది. డిసెంబరు 7 నుంచి 11 వరకు వారణాసిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు నాగమల్లేశ్వరి ప్రాతినిధ్యం వహించనున్నది. ఈ సంద ర్భంగా నాగమల్లేశ్వరిని పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు టి.విజయశ్రీ, పీఈటీ తిరుమల శెట్టి వెంకటేశ్వరరావు అభినందించారు.

వ్యర్థాలను తొలగించండి: అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మురుగు కాలువలలోని వ్యర్థా లను తొలగించాలని మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు పారిశుధ్య కార్మికు లను ఆదేశించారు. పట్టణంలోని 20వ వార్డులో సోమవారం జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు అధికారలతో కలసి పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలు తమ ఇంటి పరిసరాలతో పాటు వార్డును పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో 20వ వార్డు టీడీపీ కౌన్సిలర్ దేసు యుగంధర్, శానిటేషన్ ఇన్ స్పెక్టర్‌లు, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలి క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-ఒంగోలు ప్రధాన రైలు మార్గం లోని దుగ్గిరాల-పెదవడ్లపూడి స్టేషన్‌ల మధ్య సోమవారం గుర్తు తెలియని వ్యక్తి జారిపడి మృతి చెందినట్లు తెనాలి జీఆర్‌పీ ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపారు. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా 45-50 సంవత్సరాల వయసు కలిగి తెల్ల ఫుల్ హ్యాండ్స్ చొక్కా, బ్రౌన్ కలర్ ప్యాంటు ధరిం చిన వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెంది నట్లు గుర్తించామని, మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత గుర్తింపు లభించకపోవడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కృత్యాధార బోధనతో మంచి ఫలితాలు

తెనాలి అర్బన్, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): విద్యారంగంలో కృత్యాధార బోధన మంచి ఫలితాలు ఇస్తుందని నెహ్రూనికేతన్ ఎండీ మురళీకాంత్ పేర్కొన్నారు. బోసురోడ్డు లోని స్కూల్‌లో సోమవారం వినూత్న కార్యక్ర మానికి శ్రీకారం చుట్టారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో తరగతి గదిలో నేర్చుకున్న పలు అంశాలకు విద్యార్థులతో కృత్యాలు చేయిం చారు. బట్టీ విధానానికి స్వస్తి పలికి దృశ్య శ్రవణ మాధ్యమాలు, కృత్యాలు, క్షేత్ర ప్రదర్శ నలు వినియోగించే పాఠశాలల విద్యార్థులు రాణిస్తారని మురళీకాంత్ అన్నారు. విద్యా ర్థులు రూపొందించిన పలురకాల గృహ నమూనాలు ఆకట్టుకున్నాయి.

కౌన్సిల్‌లో పారిశుధ్యం, వీధి కుక్కలపై నిలదీత

● ప్రశ్నించిన కౌన్సిల్ సభ్యులు
● సాదాసీదాగా అత్యవసర సమావేశం

తెనాలి, మారీసుపేట, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): కౌన్సిల్ అత్యవసర సమావేశంలో పారిశుధ్యం వీధి కుక్కల బెడదపై స్వపక్ష విపక్ష సభ్యులు అధికా రులను నిలదీశారు. తెనాలి కౌన్సిల్ అత్యవసర సమా వేశం సోమవారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సి ల్ హాల్‌లో నిర్వహించారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభంకాగానే 19వ వార్డు టీడీపీ కౌన్సిలర్ పసు పులేటి త్రిమూర్తి లేచి సభ్యులెవ్వరికీ ముందస్తు సమాచారం లేకుండా అత్యవసర సమావేశాన్ని ఎలా నిర్వహిస్తారని చైర్‌పర్సన్ రాధికను నిలదీశారు. చైర్ పర్సన్ సమాధానమిస్తూ పట్టణంలో అభివృద్ధి పనులను చేపట్టామని అందుకోసమే సమావేశాన్ని నిర్వహిస్తున్నా మని ఈ సారి సభ్యులకు ముందుగానే సమాచారమిస్తా మని తెలిపారు. పలువురు స్వపక్ష విపక్ష సభ్యులు తమ వార్డులలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ హెలెన్ నిర్మల సమాధాన మిస్తూ కుక్కల శస్త్ర చికిత్సల కోసం ఏజెన్సీకి అప్పగించామని వారు రావడం ఆలస్య మైందన్నారు. వారంలో రెండుసార్లు వాటిని మంగళగిరి తరలించి శస్త్ర చికిత్సలను చేయిస్తామని తెలిపారు. శాశ్వత పరిష్కారానికి అధికారులు, కౌన్సిల్ సభ్యులతో కలసి చర్చించి ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. 27వ వార్డు కౌన్సిలర్ బట్టు అరుణ లేచి తన వార్డులో కార్మికులను ఎవరికి చెప్పి మార్చారని, ఇలా చేయడం వలన పారిశుధ్య నిర్వహణ నిలిచిపోతోందన్నారు. వైస్‌చై ర్మన్ అత్తోట నాగవేణి తన వార్డులో ఉన్న కార్మికులు స్థానికులు కావడం వలన ఎవరు పనులు చేయడం లేదని వారిని ఇతర వార్డులకు మార్చి కొత్తవారిని నియ మించాలని కోరారు. కౌన్సిల్ సభ్యుల సూచనలు మేరకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ వైద్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల తెలిపారు. అజెండాలోని 11వ అంశం చర్చకు రాగా టీడీపీ కౌన్సిలర్ త్రిమూర్తి మాట్లాడుతూ అమృత్ పథకంలో ఎన్ని కుళాయి కనెక్షన్‌లపై నిలదీ శారు. ఇన్‌చార్జ్ ఎంఈ శ్రీనివాసరావు సమాధానమిస్తూ పట్టణంలో 13550 ట్యాప్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉండగా 12019 ట్యాప్ కనెక్ష న్‌లు ఇచ్చామని తెలిపారు. పన్నుల రూపేణా సుమారు రూ.1కోటి 50 లక్షలు వస్తున్నాయని తెలిపారు. అజెండాలోని 15వ అంశం చర్చకు రాగా కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య కొబ్బరి బొండాల వ్యర్థాల రీసైక్లింగ్, వాటి ఆదాయంపై ప్రశ్నిం చారు. 4వ వార్డు కౌన్సిలర్ అడుసు మల్లి వెంకటేశ్వరావు గోదావరి జిల్లాలో ప్రైవేట్ సంస్థలు కొబ్బరిబొం డాల రీసైక్లింగ్‌కు మున్సిపాలిటీల నుంచి ఎటువంటి చెల్లింపులు లేకుండా నిర్వహిస్తున్నారని దీనిపై అధ్యయనం చేయా లని సూచించారు. చైర్‌పర్సన్ రాధిక వాయిదాపడిన అంశం తప్ప మిగిలిన అజెండాలోని 25అంశాలను ఆమె దించినట్లు చైర్‌పర్సన్ రాధిక ప్రకటించి, సభ ముగిసిం దని తెలిపారు. అనంతరం జీరో అవర్‌ను నిర్వహిం చారు. జీరో అవర్ ముందుగా టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావు తన వార్డులో తాగునీటి సరఫరా సక్రమంగా నిర్వహించడంలేదని, కబేళాలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను ప్రాంభించాలని కోరారు. పలువురు కౌన్సిల్ సభ్యులు వార్డు సమస్యలను చైర్‌పర్సన్ రాధికకు తెలి పారు. అధికారులతో కలసి చర్చించి సమస్యలను పరి ష్కరిస్తామన్నారు.



కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, అధికారులను నిలదీస్తున్న టీడీపీ కౌన్సిలర్ త్రిమూర్తి

ఘనంగా కార్తీక సోమవార పూజలు

తెనాలి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవార పూజలు కార్తీక మాసం చివరి సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాలలో మహిళలు పెద్దఎత్తున కార్తీక దీపాలు వెలిగించి స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు. శివలింగాకృతిలో కార్తీక దీపాలు వెలిగించారు. గంగానమ్మపేటలోని పర్వతవర్ధిని సమేత రామేశ్వరస్వామి ఆలయంలో, మారీ సుపేట శివాలయం, రామలింగేశ్వరపేట రామలింగేశ్వర స్వామి ఆలయం, స్వామివారికి అభిషేకాలు నిర్వహిం చారు.

● కొల్లిపర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో నాలుగవ సోమవారం కావడంతో మండలం లోని దేవాలయాల్లో వైభవంగా పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో కృష్ణానదిలో స్నానాలు చేసి పసుపుతో వినాయకుడిని చేసి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. కృష్ణానది ఒడ్డున ఉన్న లక్ష్మీతిరుప తమ్మ ఆలయాల్లో కూడా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వ హించారు. అనంతరం మహిళలు శివాలయాలకు చేరు కుని 365 ఒత్తులను వెలిగించారు. మండల కేంద్రం కొల్లి పర గంగా పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి దేవస్థా నంలో శివలింగానికి వివిధ అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీ జనార్ధనస్వామి దేవస్థానంలో, షిర్డిసాయి బాబా మందిరంలో పండితులు ప్రత్యేక పూజలు జరి పారు. ఈ సందర్భంగా పండితులు పిచ్చియ్యశర్మ, కుమారస్వామి, కుటుంబరావు, జగన్నాథాచార్యులు కార్తీ కమాస విశిష్టత గురించి భక్తులకు తెలియజేశారు.



శివలింగాకృతిలో ఏర్పాటుచేసిన కార్తీక దీపాలు

మాజీ మంత్రి అంబటి అండతో తమ్ముడు అక్రమ నిర్మాణాలు

ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఫిర్యాదు

విజయవాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబును అడ్డం పెట్టుకుని తమ్ముడు అంబటి మురళికి చెందిన ఆదిత్య ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ గుంటూరులో చేపట్టిన నిర్మాణాలు నిబంధన లకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్మిస్తున్నా రని, వాటిపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కోరారు. సోమవారం విజ యవాడలోని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాల యంలో బోర్డు మెంబర్ సెక్రటరీ ఐఎఫ్ఎస్ అధికారి శర్వానంద్‌కు ఆదిత్య ఇంఫ్రాటెక్ నిర్మాణాలపై పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గుంటూరులో బజరంగ్ జ్యూట్ మిల్ సమీ పంలో ఆదిత్య ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ భారీ నిర్మాణాలపై చట్ట ఉల్లంఘనలు చేసిన వైనాన్ని పీసీబీ అధికారులకు వివరించినట్లు వెల్లడించారు. అధికారులు తనిఖీలు లేకుండా కళ్లు మూసుకుని ఫైర్ డిపార్టుమెంట్ అడిష నల్ డీజీ సంజయ్, మాదిరెడ్డి ప్రతాప్ ఇద్దరూ ఎన్‌వో సీలు ఇచ్చారని ఆరోపించారు. అపార్టుమెంట్ నిర్మా ణంలో ప్లాన్‌లో ఒకలా చూపించి నిర్మాణాలు మరోలా చేపట్టారన్న విషయాన్ని స్పష్టంగా తెలిపానన్నారు. పొల్యుషన్ బోర్డు నుంచి అనుమతులు తీసుకోకుండా భారీ ప్రాజెక్టును ప్రారంభించారు. ఉల్లంఘనలు జరి గితే ఈసీని రద్దు చేసే అధికారం పీసీబీకి ఉంటుంద న్నారు. నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేకుండా గుంటూరులో గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్ ఎలా నిర్మాణం చేపట్టారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రైల్వే, వాటర్, ఫైర్ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా భారీ అపార్టుమెంట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు వెల్లడించారు. అపార్టుమెంట్ నిర్మాణదారులు మధ్యతరగతి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. గ్రీన్ గ్రేస్ అపార్టు మెంట్ పేరిట వైట్ కాలర్ నేరం చేస్తున్నారు. గత ఐదే ళ్లలో ఒక్క అధికారి కూడా అయా అపార్టుమెంట్ వైపు కన్నెత్తి చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధ నలు ఉల్లంఘించినందున చట్టపరమైన చర్యలు తీసు కోవాలని పీసీబీ అధికారిని కోరినట్లు వెల్లడించారు.

యువకుడి అనుమానాస్పద మృతి

పొన్నూరు టౌన్, నవంబరు 25: పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలుకు చెందిన యువకుడు అనుమానస్పద రీతిలో మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం పట్టణంలోని 15వ వార్డు సంజయ్ నగర్ కాల నీకి చెందిన హైజాక్ బాబు (21) శనివారం సాయంత్ర ఇంటి నుంచి వెళ్లి అదృశ్య మయ్యాడు. హైజాక్‌బాబు కోసం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా సోమవారం సమీపంలోని పంట పొలాల్లో ఉన్న బావిలో హైజాక్ బాబు మృతదేహం లభ్యమైంది. హైజాబ్ బాబు మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సమాచారం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు.



ఎన్‌సీసీ డే కేక్‌ను కట్ చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైని, అరుణ సుజాత

కొనసాగుతున్న ఎన్‌సీసీ డే వేడుకలు

తెనాలి, మారీసుపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎంజే కళాశాలలో 10వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ గుంటూరు, జేఎంజే కళాశాల సంయుక్తంగా నిర్వహి స్తున్న 76వ ఎన్‌సీసీ డే వేడుకలు సోమవారం కూడా నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ ఆధ్వర్యంలో విశ్రాంత ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ ఎస్ ఉమామహేశ్వరి పాల్గొని ఎన్‌సీసీ డే కేక్‌ను కట్‌చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సీసీ వల్ల నాయకత్వ లక్షణాలు, నిబ ద్ధత, అంకితభావం అలవడతాయన్నారు. ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ మాట్లాడుతూ ఎన్ సీసీ వల్ల మంచి దృక్పథాన్ని అలవర్చుకోవచ్చన్నారు. అనంతరం ఎన్‌సీసీలో వివిధ క్యాటగిరిలో ప్రతిభ చాటిన క్యాడెట్స్‌కు మెడల్స్‌ను బహూకరించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె నిర్మలజ్యోతి, ఎన్‌సీసీ సీటీవో జి ఎస్తేరురాణి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి: డాక్టర్ హనీఫ్

తెనాలి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సంగంజాగర్లమూడి పీహెచ్‌సీ వైద్యులు షేక్ హనీఫ్ చెప్పారు. సోమవారం మండలంలోని సంగంజాగర్లమూడి హైస్కూల్‌లో స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమం ద్వారా వైద్యసిబ్బంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలున్న విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. డాక్టర్ హనీఫ్ ఆరోగ్యసూత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రహీమ్ సాహెబ్‌కు కవి సత్కారం

పొన్నూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన ఆర్టీసి కండ క్టర్, కవి గాయకుడు షేక్ రహీమ్ సాహెబ్‌కు కవి సత్కారం లభించింది. అనంతపు రంలో లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన జాతీయ శతాధిక కవి సమేళనంలో పాల్గొన్న రహీమ్ సాహెబ్ మానవ... ఆలోచించు అనే కవితా గానాన్నికి ఈ కవి సత్కారాన్ని అందచేసారు. కార్యక్రమంలో లేపాక్షి ఫౌండేషన్ సభ్యులు తెలుగు కవులు తదితరులు పాల్గొన్నారు.



కవి సత్కారం అందుకుంటున్న షేక్ రహీమ్ సాహెబ్



తహసీల్దార్ గోపాలకృష్ణను సత్కరిస్తున్న మండల రైతులు

తహసీల్దార్ గోపాలకృష్ణకు రైతుల సత్కారం

తెనాలి రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు రైతులు తహసీల్దార్ గోపాలకృష్ణను దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. ఎన్నో ఏళ్లుగా వెబ్‌ల్యాండ్‌లో అడంగల్, వన్‌బీలు, ఇలా రెవెన్యూలో పలు తప్పు ఒప్పులు సరిచేయించేందుకు రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేది. తహసీల్దార్ గోపాలకృష్ణ ఆ సమస్యకు పరిష్కారం కనుగొని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ సోమవారం ఆయన కార్యాలయంలో మర్యా దపూర్వకంగా కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు.



ప్రకృతి విధానంలో సాగవుతున్న వరి పొలాలను పరిశీలిస్తున్న తెలంగాణ రైతులు

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన తెలంగాణ రైతులు

చేబ్రోలు, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సోమవారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన నల్గొండ, వరంగల్ జిల్లాలకు చెందిన రైతులు సందర్శించారు. వడ్లమూడిలో సూర్యదేవర ఉమాహేశ్వర రావు, పాటిబండ్ల శ్రీధర్ ప్రకృతి పద్ధతులలో వరి పంటలను సాగు చేస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న తెలంగాణ రైతులు ఈ వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు మాట్లాడుతూ ప్రకృతి పద్ధతుల ద్వారా సాగు చేస్తే వరిలో వేరు వ్యవస్థ దృడంగా ఉంటుందన్నారు. ప్రకృతి పద్ధతుల ద్వారా ఆరోగ్యకరమైన దిగుబడులను పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి అభిలాష్, అధూషా తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, డాక్టర్ శారద

చెడుగా ప్రవర్తించే వారిని బాలికలు గుర్తించాలి: తహసీల్దార్

తెనాలి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమతో చెడుగా ప్రవర్తించే వారిని బాలికలు గుర్తించాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సూచించారు. డాక్టర్ శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బుర్రిపాలెం హైస్కూల్‌లో ఇంటర్నేషనల్ ఫర్ ది ఎలిమినే షన్ ఆఫ్ వైలెన్స్ ఎగైనెస్ట్ ఉమెన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ఎక్కడైనా పురుషులు అసౌకర్యంగా వ్యవ హరిస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్దల దృష్టికి తేవాలన్నారు. జీవితాన్ని చక్కగా తీర్చిదిద్దేందుకు అవసరమైన క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. డాక్టర్ శారద మాట్లాడుతూ గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. దీనిపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. హెచ్ఎం రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌ను సత్కరిస్తున్న ముస్లింలు

భూ సమస్యలకు ధూళిపాళ్ళ పరిష్కారం

● కృతజ్ఞతలు తెలిపిన ముస్లింలు

పొన్నూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో సుదీర్ఘ కాలంగా ఉన్న భూ సమస్యలను మూడు నెలల కాలంలో పరిష్కరించి ముస్లిం మైనార్టీలకు ఎంతో మేలుచేశారని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ను ముస్లిం నాయకులు కొనియాడారు. సోమవారం మండల పరిధి లోని చింతలపూడిలో ముస్లిం నాయకులు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పట్టణంలోని 25వ వార్డు ఇటికంపాడు రోడ్డులోని నూర్ మస్జీద్ సమీపంలో ఇళ్ల స్థలాలు, గృహాలు మసీదు సర్వే నెంబరు కింద నమోదు కావటంతో ఆ ప్రాంతంలో దశాబ్దాలుగా ఇళ్ల స్థలాలు కొనుగోలు, అమ్మకాలు జరగాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ దృష్టికి ఈ మస్యను తీసకొని వెళ్లగా నూతన ప్రభుత్వంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మసీదు సర్వే నెంబరు నుంచి సమీప నివాస గృహాలను సర్వే చేయించి సబ్ డివిజన్ చేయించటం ద్వారా ఆంక్షలను ఎత్తివేయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్‌ను సన్మానించి, మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పట్టణ, టీడీపీ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్‌ఖాన్, నియోజ కవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫైరోజ్‌ఖాన్, జానీబేగ్, మహ్మద్ బేగ్, షేక్ సిలార్ బాషా, షేక్ నదీమ్ జానీ తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులకు వ్యతిరేకంగా ర్యాలీ

పొన్నూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): పని ప్రదేశాలో మహిళలపై వేధింపు లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటా మని తహసీల్దార్ జియావుల్‌హక్ హెచ్చ రించారు. సోమవారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ జెండర్ క్యాంపైన్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ జరిగింది. చిన్నారులపై లైంగిక వేధింపులు జెండర్ ఆధారిత హింస, పిల్లలకు నిరంతర విద్య, అక్రమ రవాణా చట్టం, బాల్య వివాహాల నిరోధిక చట్టం, గృహ హింస చట్టం గురించి అవగాహన కల్పించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మహిళలు మానవహారంగా ఏర్పడి ప్రదర్శన జరిపారు. కార్యక్రమంలో ఏపీఎం జ్యోతిబాబు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జెండర్ క్యాంపైన్ ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

పీఎఫ్ ఇప్పించాలని కలెక్టరేట్ ఎదుట మాజీ ఉద్యోగుల నిరసన

గుంటూరు (తూర్పు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెదకాకానిలో ఉన్న విలేజ్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ సంస్థ నుంచి మాకు రావాల్సిన పీఎఫ్, ఇతర సదుపాయాలను ఇప్పించాలని ఆ సంస్థ మాజీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముప్పైఏళ్ల పాటు ఆ సంస్థలో పనిచేశామని, దానికి సంబంధించిన పీఎఫ్ ఇంతవరకు ఇవ్వలేదని వాపోయారు. అధికారులు పీ ఎఫ్ ఇవ్వాలని ఆదేశాలు జారీచేసినా సంస్థ యాజమాన్యం పట్టించుకోవడం లేదని అన్నారు. పీఎఫ్ అందకపోవడంతో ఉద్యోగ కుటుంబాలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి సదరు సంస్థ నుంచి పీఎఫ్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. నిరసనల్లో టి మాలతి, ఎస్ విల్సన్, జి పోసయ్య, పి ప్రభాకర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.